ఓం శ్రీ సాయిరాం

# గ్రామ సేవయే - సాయి సేవ

( గ్రామసేవలో యువత )



ప్రచురణము

**శ్రీసత్యసాయి సేవా సంస్థ**

ఆంధ్రప్రదేశ్

# ఓ ఆంధ్ర యువకుడా లేవోయీ.....

పల్లవి॥ ఓ ఆంధ్ర యువకుడా లేవోయీ
- సత్యసాయిని చూడ పదవోయీ...
ఓ ఆంధ్ర యువకుడా లేవోయీ
- గ్రామసేవలు చేయపదవోయీ...

చరణం 1. భారతావనిలోనె భగవంతుడున్నాడు
- అఖిల లోకంబుకే అద్భుతంబైనాడు...
అందరికి ఆనందమందింపవచ్చాడు
- పర్తీపురంబులో వెలసినాడీతడు... ॥ ఓ ఆంధ్ర ॥

చరణం 2. టి.వి.లు, మూవీలు తిలకించ వద్దురా
- చెత్త సాహిత్యాలు చదవనే వద్దురా...
రాజకీయాలంటూ రచ్చలూ మనకొద్దు
- సాయి సందేశమ్ము స్వాగతించోయీ ॥ ఓ ఆంధ్ర ॥

చరణం 3. విద్యలన్నియు నేడు విద్యార్థికందించే
- విలువైన పాఠాలు ఇలలోనే బోధించె
శాస్త్రముల తల్లియే సత్యరూపంబాయె
- సద్విద్య నేర్వగా సాయిని చేరోయి ॥ ఓ ఆంధ్ర ॥

చరణం 4. భువనానికంతయూ భూషణంబైన
- వైద్యభవనంబునే ఇలలోన సృష్టించె
ఇహలోక బాధలు ఇలలోనే తీర్చంగా
- ఇక్కడికే తెచ్చెరా ఇంద్రలోకంబు ॥ ఓ ఆంధ్ర ॥

చరణం 5 రాయలసీమంత రాళ్ళసీమైపోయె
- అనంతప్రజకేమో నీరు కరువాయె
అనంత కష్టాలు దయతోటి తీర్చంగా
- అపరశంకరుడై తాను గంగనే ఇచ్చాడు ॥ ఓ ఆంధ్ర ॥

ఓం శ్రీ సాయిరాం

# గ్రామ సేవయే - సాయి సేవ

**( గ్రామసేవలో యువత )**

ప్రతులకు

**ఎ. వెంకటేశ్వర రావు**

ప్లాటు నం. 112, సాయికృప,

లలితా నగర్, హైదరాబాదు - 500 044.

అఖిలాంధ్ర యువ చైతన్యమే ధ్యేయంగా...

యువజనుల హృదయాలలో సేవోత్సాహం

వెల్లువెత్తి ప్రవహింప చేయాలన్న

ప్రార్థనలతో...



స్వామివారి పాదపద్మములకు

భక్తి శ్రద్ధలతో...

సమర్పితము.

- ప్రకాశకులు

ఓం నమో శ్రీ సత్యసాయిరాం

# ప్రస్తావన

"గ్రామ సేవ యన్న రామ సేవయే సుమీ!
రామ రాజ్యమన్న ప్రేమ మయమే
ప్రేమ లేకయున్న క్షేమంబు లేదయా
సేవ లేక యున్న శాంతి లేదు"

- బాబా

నేడు శ్రీసత్యసాయి మహోద్యమము ప్రపంచం నలుదిక్కులా వ్యాప్తి చెంది, యావత్‌జనసమూహములను అత్యద్భుత సాయిసేవా పథంలో పయనింపచేస్తున్నది. నేడు ఎచ్చట చూచినా వినిపించేది సాయి నామమే. కనిపించేది సాయిసేవయే. సర్వం సాయి మయం అవుతున్న రోజులివి. ఈ ప్రణాళికలో ఒక భాగమే, యువతను ఎన్నుకొని వారి చేత గ్రామ సేవలు చేయించుట. యువత కూడా ఇది తమ కనీస బాధ్యతగా గుర్తించి కార్యక్రమములు చేపడుతున్నారు. యువతయే దేశానికి సంపద, వెన్నుముక. అట్టి యువతను సరియగు మార్గంలో నడుపుటకు గ్రామసేవ కార్యక్రమములు చేపట్టవలసిన విధానము, చేపట్టుటకు కారణములను తెలియచేసి వారి ప్రయత్నమును ద్విగుణీకృతము చేయుటయే కాక ఇంకనూ సేవా కార్యంలోని మధురానుభూతిని అనుభవించలేని ఎందరో యువజనుల హృదయాలలో సేవోత్సాహం కల్గించే నిమిత్తమై శ్రీ సత్యసాయి వార్డు కౌన్సిల్ వారిచే ప్రశాంతి నిలయంలో **1999** వ సంవత్సరము నవంబరు **18, 20, 21** తేదీలలో శ్రీ స్వామి వారి దివ్య సన్నిధిలో ద్వితీయ అంతర్జాతీయ యువ సమ్మేళనమును ఏర్పాటు చేయబడినది.

అందుకు ఎన్నుకోబడిన యువతకు యీ సేవల గురించి, చేయవలసిన విధానంగురించి కొంత అవగాహన, సమావేశానికి ముందే కలుగ చేస్తే మంచిదనే అభిప్రాయంతో ఈ చిన్న పుస్తకమును ప్రచురించి స్వామి వారి

పాదాలకు అంకితం చేస్తున్నాము. స్వామివారు జరిపే ఈ మహోద్యమంలో ఉడతా భక్తిగా ఈ చిన్న పుస్తకమును ఆంధ్ర యువతకు అందించబడుచున్నది.

ఈ పుస్తకమునందు, చేయుటకు వీలైన, అందుబాటులో ఉన్న వివిధ కార్యక్రమములు సూచించబడినవి. అందులో వారివారి ఆర్థిక పరిస్థితి, మానవ వనరులు, గ్రామ పరిస్థితి, గ్రామస్థుల స్పందనను బట్టి ఏఏ సేవలను చేపట్ట వలెనో నిర్ణయించవలెను. ఈ చిన్ని పుస్తకము యువజనుల కరములందు ప్రజ్వరిల్లు దీపమై అఖిలాంధ్ర పర్యంతము సేవా కార్యములు చేయుటకు యువతకు తోడ్పడగలదన్న దృఢవిశ్వాసముతో మీకందించే ప్రయత్నం చేస్తున్నాము.

ఈ ప్రయత్నాలన్నీ సఫలీకృతం అగుటకు స్వామి వారి ఆశీస్సుల కొరకు ప్రార్థిస్తూ....

చేసెడిది గ్రామ సేవయట
చేయించెడి విభుండు సాయి రాముడట
చేసిన భవహరమగునట
చేసేద వేరొండు సేవ నే చేయగనేలా

సదా సాయి సేవలో

**- శ్రీ సత్యసాయి సేవా సంస్థ**

ఆంధ్రప్రదేశ్.

# గ్రామ సేవయే - సాయి సేవ

**( గ్రామసేవలో యువత )**

<u>విషయ సూచిక</u>


| సంఖ్య | విషయము | పుట సంఖ్య |
|---|---|---|
| 1. | భగవానుడి దివ్య సందేశము | 1 |
| 2. | గ్రామ సేవలో యువత | 4 |
| 3. | గ్రామసేవలు | 6 |
| 4. | త్రివిధ విభాగములు - సేవలు | 8 |
| | ఎ) ఆధ్యాత్మిక విభాగము | 8 |
| | బి) సేవా విభాగము | 9 |
| | సి) విద్యా విభాగము | 15 |
| 5. | మహిళా గ్రామసేవలు | 17 |
| 6. | ఇతరములు | 18 |
| 7. | గ్రామదర్శిని | 21 |
| 8. | నివేదిక | 22 |
| 9. | వ్యక్తిగత ధర్మములు | 24 |
| 10. | దీక్షా ప్రార్థన - ప్రతిజ్ఞ | 38 |

# 1. భగవానుడి దివ్య సందేశము

నీవెక్కడికెళ్లినా సరే! సర్వకర్మలందు నీ కర్తవ్యమును నీవు నిర్వర్తించు. నీవు చేయు ప్రతిపనిలోను నేను నీ హృద్యాసినై నివసించి నీకు మార్గదర్శనం చేస్తాను. జీవిత ప్రయాణంలో ప్రతి మెట్టును నేను నీతో అధిగమింప చేస్తాను. రానున్న కాలంలో నా దివ్యావతార వైభవమును చూపించ గలను. నీవు నావాడివి, ప్రియాతి ప్రియమైనవాడివి, కనురెప్పలు కనుగుడ్లను కాపాడు విధముగా నేను నిన్ను కాపాడుతాను. నేను నిన్నెన్నడును విడువను. కారణం నీవెల్లప్పుడు నాతోడనే ఉంటావు. నీవు దేని వెనుకను పరిగెత్తనవసరం లేదు. ప్రేమతో అందరిలో భగవంతుని దర్శించు, ఓర్పుతో జీవించు. సకాలంలో నీకు కావలసినవి నేనే అందిస్తాను. సుఖసంతోషములతో జీవించు. వ్యర్థ దుఃఖమునకు తావివ్వకు. ఏదిఏమైనా, ఎట్లు జరిగినా అది అంతయు నా సంకల్ప విశేషమనే గ్రహించు. యావత్ సృష్టిలో ఏ శక్తియు నేను సంకల్పించిన ఈ అవతార కార్యక్రమమును ఆటంకపరచ లేదు. ఆలస్యము చేయలేదు. మనిషిలో వున్న శక్తి, సామర్థ్యమును మరియు ప్రతిభను పరుల సేవకి అంకితం చేయాలి. ఇందులోనే జీవిత లక్ష్య సాధన ఇమిడివుంది. మానవులందరూ సోదరులే అందరూ ఒకే విధమైన శక్తినుండి ఆవిర్భవించినవారే. అందరిలోనూ ఆవరించివున్నది ఒకే దివ్యత్వము. మానవసేవ ద్వారానే ఇట్టి దివ్యత్వము మరింత వికసిస్తుంది. ఇట్టి దివ్యత్వము మరింత వ్యాపిస్తుంది.

ఇట్టి సేవలే మనిషిని స్పందింపచేసి, జీవితమునకు వెలకట్టలేని విలువనందిస్తాయి. మానవసేవయే మాధవ సేవ. కారణం సర్వజీవులందు, ప్రాణులందు, కణువు నందు, అణువునందు భగవంతుడే ఉంటున్నాడు.

మీ శక్తి యుక్తులను భగవంతుని చరణారవిందములకు అర్పితం గావించండి. ప్రతి సేవా కార్యాన్ని కుసుమంగా చేసి అహంకార, మమకార రహితంగా మార్చి దానిలో ప్రేమానురాగములు త్యాగమనే సువాసనలు చేర్చండి.

మీ ప్రతిభను కేవలం లౌకికానందం కొరకు ఉపయోగపెట్టక భగవంతుని దివ్య వైభవమునకు అంకితం చేయండి. దివ్యానందం అనుభవించండి. తద్వారా మిమ్ము మీరు ఉద్ధరించుకోండి.

– బాబా

ఓ నా భక్తులారా, ఈ అవతార కార్యక్రమంలో మీ వంతు పని ప్రారంభమయింది. ఈ జీవిత కాలంలో మీలో ప్రతి ఒక్కరు అద్వితీయమైన, అమూల్యమైన పాత్ర నిర్వహించవలసి యున్నది. నేనెవరిని పిలుస్తానో వారు మాత్రమే నా సేవ చేయగలుగుతారు.

ఈ అవతార కాలంలో మీలో ప్రతి ఒక్కరు పని చేయవలసిన సమయం వచ్చింది. ఈ విశాల విశ్వంలో భూమికి ఒక ప్రయోజనం వుంది. అది మీ కన్నులకు ఇప్పుడు క్రమంగా గోచరిస్తుంది. మీ పరిధిలోనికి వచ్చేవారి అందరిపైన మీ భక్తిని ప్రసరింపజేయండి. కంటికి కనిపించనట్టి దాని శక్తి అందరినీ ఆవరిస్తుంది. మీ శత్రువునందు కూడా నన్ను దర్శించండి. మీరు చేయు పనిని మీరు విజయవంతంగా నిర్వహించేందుకు ఎప్పుడూ నాపైననే ఆధారపడి వుండండి. కర్మఫలితాన్ని ఆశించకుండా మీలోని పవిత్రతను సర్వ మానవాళికి సమస్త ప్రాణకోటికి అర్పించండి.

నా అవతార కార్యక్రమమందలి ఈభాగం చాలనిశబ్దంగా జరుగుతుంది. మీరు నాప్రేమను ప్రసరింపజేసె సాధనాలు, మీలో ఏ మాత్రం అహంకాం పొడ చూపిన మీద్వారా నేను పనిచేయటం ఆగిపోతుందని ఎల్లప్పుడూ ఎరుక కలిగి వుండండి. మీ అశ్రద్ధను, మీ అహంకారాన్ని ఎప్పుడు మీరు అధిగమిస్తారో అప్పుడు మరల మీద్వారా నాపని జరగటం ప్రారంభమవుతుంది. అనంతమైన నాప్రేమను ప్రపంచంలోని వారందరు అనుభవిస్తారు. ఈ పనికొరకు అనేక జన్మలుగా మిమ్మల్ని నేను సంసిద్ధం చేసాను. మిమ్ములను నావైపుకు ఆకర్షించుకున్నాను. నాఅవతార కార్యానికి గతంలోనే ఘనంగా అభివృద్ధిసోపానాలు వేసాను.

నా పనికి ముగింపు లేదు. అలాగే మీ పనికి అంతులేదు. నేను మీలోపల వెలుపల అంతటా వున్నానని తెలుసుకోండి. తేడా ఏమిలేదు. అల్పమైన విషయాలనుండి శాశ్వతంగా విముక్తి పొందండి. అప్పుడు మీరే నేను, నేనే మీరవుతారు. ఇందుకు సందేహం లేదు.

నా దర్శనానుగ్రహం మీమీదా, మీద్వారా ఇతరుల మీద వర్షిస్తుంది. ఎడతెగకుండా జరిగే ఈ ప్రక్రియ గురించి మీకు తెలియకపోవచ్చును. మీ హృదయాన్ని మనసునూ ఎల్లప్పుడు పవిత్రంగా ఉంచుకోండి. మీ ప్రత్యేక

గుణాలవల్ల మీ జీవితకాలంలో మానవాళి మేలు పొందుతుంది. నేను నావద్దకు ఆకర్షించుకొన్నప్పుడు ఇతరులు కూడా వచ్చి ఈ అవతార కార్యక్రమంలో నాతో కలుస్తారు. మానవాళి అంతా సమైక్యతతో జీవించే కాలం ఆసన్నమవుతుంది. ఎవ్వరూ ఊహించలేనంత త్వరలో అది జరుగుతుంది. అది వచ్చే లోపుగా ప్రతి ప్రాణికి అసలైన జీవిత ధ్యేయాన్ని వెల్లడి చేసేందుకు సంసిద్ధం కండి. ఎవ్వరూ దానిని ప్రయత్నించి సాధించలేరు. అది పూర్తిగా ఊహాకందని విషయం. దాని సౌందర్యం కలలో కూడా ఊహించలేనంతటి దేదీప్యమానమైనదని నేను చెప్పగలను.

మీలో ప్రతి ఒక్కరు మీ పనిని నిశబ్దంగా చేస్తూవుంటే నేను మిమ్మల్ని నా హృదయానికి హత్తుకుంటాను. అప్పుడు మీ ఆత్మలు ఉద్ధరింపబడతాయి. మీలో నా ఉనికిని మీ కండ్లు వెల్లడి చేస్తాయి. సమస్త విశ్వం ఏకమయ్యే మేరు శిఖరాగ్రం నుండి దీనిని నా భక్తులందరికి చాటి చెపుతున్నాను. నా ప్రియమైన భక్తులారా నాపనిలో నిమగ్నమై ఉండండి. మీ ఊపిరిలో స్వర్గ ప్రసూనాల సుగంధం వ్యాపించుతుంది. మీరు దేవతలవలె ఆదర్శప్రాయంగా వుంటారు. మీ సంతోషమే నా సంతోషం.

✡✡✡

## ౨. గ్రామ సేవలో యువత

ఈ విషయంలో మూడు పదాలున్నాయి. అత్యవసర మయినది, ఆధారభూత మయినది, 'సేవ'. అది ఎక్కడ, ఎవరు చేయవలసినది, తెలియ చేయునవే మిగతా రెండు పదములు.

1. సేవ :- శ్రీ స్వామి వారు సేవ గురించి ఈ విధంగా బోధిస్తారు. "సేవ చాల చిన్నపదం. కాని దీని అర్థం అమోఘం. దైవ సన్నిధికి చేర్చే రాజమార్గ మిది. సేవ చేయని మానవుడు జీవిత రహస్యమును గుర్తించుకోలేడు.

సేవకు మించిన సుగుణం మరొకటి లేదు. సేవ అహంకారమును నిర్మూలముగావించి జీవుణ్ణి దేవునిగా మార్చగల శక్తి గలది. ఇట్టి సేవను అభివృద్ధి గావించుకొనుటకు, ప్రేమ, దయ, త్యాగం అనే త్రిమూర్తి స్వరూప మును ధరించాలి. ఈ త్యాగమనేది మానవునకు అనేక రకములైన యోగము లను చేకూర్చును. సేవ అనేది కేవలం గ్రంథాలలో చదువుకుని చేసేదికాదు. ప్రేమయొక్క పరాకాష్ఠ, సేవ. సేవయొక్క ప్రతికరూపం త్యాగం".

మన సంస్థలో సేవలకు అత్యంత ప్రాధాన్యత, ప్రాముఖ్యత యీయబడి నవి. ఈసేవా కార్యాక్రమాల ఆశయం క్రమశిక్షణతో మనలను మనమే సంస్క రించుకొని ఉద్ధరించబడుటయే. ఈసేవలు ప్రారంభించడానికి, ముందు మూడు ప్రశ్నలు వేసుకొని సమాధానం పొందాలి. 1.సేవలు ఎవరికోసం 2.ఎందుకోసం 3.ఎట్లచేయాలి. అనే ప్రశ్నలకు ఒకటే సమాధానం. మనకోసమె, మనలోని అహంకార మమకారాలను, రాగద్వేషాలను త్రుంచివేసి, మనమంతా ఒకటే అనే భావన పెంపొందిచునది మరియు యీ దేహము వచ్చినది పరుల సేవ కొరకే అని తెలుసుకొనుటకు అని గ్రహించి సేవలో పాల్గొనాలి. సేవ నిస్వార్థంగా చేయాలి. ఫలితాన్ని భగవదర్పితం చేయాలి. తద్వారా మన అంతిమ గమ్యం చేరుటకు కావలసిన మానసిక పరివర్తన సమాధిస్థితి కలుగుతుంది.

2. గ్రామం:- ఈ విషయంలోకూడా స్వామివారు ఈ విధంగా అంటారు. "సేవచేయడం చాల గొప్పతనం తీర్థయాత్రలు చేయకపోయినా ఫరవా లేదు. సే వలుచేయండి. సేవకత్వంనందే నాయకత్వం యిమిడియున్నది. సేవలు చేసిన

వారికే శాంతి చేకూరుతుంది. అహంకారం నిర్మూలమవుతుంది. ఈనాడు గ్రామాలలో అపరిశుభ్రత పెరిగి పోయింది. సరైన ఆహారం, నీరు లేక పోవుటచేత ప్రజలు అనేక రోగాలకు గురవుచున్నారు. అట్లాంటి గ్రామాల్లో ప్రవేశించి సేవచేయాలి.

భారత దేశమంటే అందులోని పల్లెలు, గ్రామాలు. ఇవి బాగుంటేనే దేశం బాగుంటుంది. పట్టణ ప్రజలు వారి అవసరాలకు చాలావరకు గ్రామాల మీదనే ఆధారపడి యున్నారు. కాబట్టి గ్రామసేవ అనేది గ్రామానికేకాక దేశ ఔన్నత్యాకిని అత్యవసరం.

3. <u>యువత</u>:- యువత అంటే ఎవరు.? ఎక్కడినుండి వచ్చారు? అనే ప్రశ్నలు ఆలోచించుకుంటే, యువత అనేది ఒక గ్రామానికి, ఒక రాష్ట్రానికి, ఒక దేశానికే కాక, యావత్ ప్రపంచానికి వెన్నుముక లాంటిది. వీరు ఆ గ్రామము నుండి వచ్చినవారే. ఆ సమాజము నుండే వారి వారి అవసరాలను తీర్చుకుంటున్నారు. అట్టి సమాజమునకు వీరు ఏమి చేయాలి?

యువత అచ్చటి ప్రజల యొక్క శక్తి. ఈ శక్తిని సరియగు మార్గంలో నడిపించాలి. పరుల సేవ కొరకే ఈ శరీరం వచ్చినదని తెలుసుకొని, సద్వినియోగం చేసిన అది ఎంతో మంచిది. మరియు ఇది సమాజానికి మేలు చేకూరుస్తుంది. అందు నిమిత్తమై సమాజ సేవ చేయాలని, ముఖ్యంగా సరైన ఆహారం, త్రాగే నీరు, రవాణ, వైద్య సౌకర్యం లేక బాధ పడుతున్న గ్రామాలలో యువకులు నాయకత్వం వహించి గ్రామానికి కావలసిన సేవలు అందించి అచ్చటి ప్రజలలో సుఖ సంతోషాలు పెల్లుబికేటట్లు చేయగలిగితే అంతకంటే చేయవలసినది, చేయగలిగినది మరొకటి లేదు.

యువత అంటే 18 నుండి 30 సంవత్సరాల వయస్సులోపువారు. మంచి ఆరోగ్యం కలిగి సేవలలో చురుగ్గా పాల్గొంటున్నవారికి వయోపరిమితి 35 సం॥ల వరకు ఉండవచ్చును. "మానవ జీవితంలో యవ్వనమనేది చాలా ప్రధానమైనట్టిది, ప్రమాణమైనట్టిది. ఆదర్శవంతమైన జీవితాన్ని అందించుటకు ఇది సరయిన సమయం. ఈ సత్యాన్ని యువత గుర్తించి తమ కాలమును సద్వినియోగ పరచు నిమిత్తమై కృషి సల్పాలి" అని అంటారు స్వామివారు.

# ౩. గ్రామ సేవలు

ఈ కార్యక్రమములో మొట్టమొదట గ్రామమును ఎన్నుకొనుటతో ప్రారంభమవుతుంది.తదుపరి అచ్చటి గ్రామస్తులను, గ్రామ పెద్దలను, యువతను, గ్రామంలోని విద్యా సంస్థల ప్రతినిధులను, కార్యకర్తలను కలిసి మన సంస్థను, మనలను పరిచయం చేసుకొని మనం చేయదలచుకున్న గ్రామసేవల ఉద్దేశ్యం తెలియచేయాలి. కలిసిన వారి పేర్లు, వయస్సు ఇతర వివరాలు వ్రాసుకోవాలి. గ్రామమును ఎన్నుకొనుటలో రాష్ట్ర సమన్వయ కర్త లేక సమితి కన్వీనరు పూర్తి సహకారమును అందించాలి.

సాధారణంగా గ్రామాలలో స్వామి భక్తులుంటారు. అట్టివారి సహకారం పొందితే మన పని సులభమవుతుంది. మరల ఆగ్రామమును సందర్శించి గ్రామమునకు కావలసిన అవసరాలు, అచ్చటి గ్రామస్థుల అలవాట్లు,పరిస్థితులను తెలుసుకొని మన అందుబాటులో చేయగలిగిన, వారి అవసరాలను తీర్చగలిగిన సేవా కార్యక్రమములను నిర్ణయించుకోవాలి. ఈసందర్శనంలోనే అచ్చటి ప్రజల ఆరోగ్య పరిస్థితి అచ్చట ప్రబలంగా ఉన్న వ్యాధులను, అందుకు కారణాలను తెలుసుకొని వాటి నివారణకు కావలసిన మందులు ముందుగానే సమకూర్చుకొనవలెను. అందుకై రెండవ పర్యాయం వెళ్ళునపుడు సేవకులు తమ వెంబడి ఒకరిద్దరు వైద్యులను తీసుకొని వెళ్ళవలెను.

ఈసేవలలో ఆగ్రామములోనున్న స్థానికులను ముఖ్యముగా యువతను కలుపుకొని కార్యక్రమములు చేయవలెను. తద్వారా ఈ సేవలు ఎట్లా చేయవలెనో, ఎందుకు చేయవలెనో వారికి అవగాహన, అనుభవం కలుగుతుంది. స్థానికులు పాల్గొనకుండా ఇట్టి కార్యక్రమాలు చేపట్టిన సత్ఫలితము ఇవ్వవని గుర్తించాలి. ముఖ్యముగా గ్రామములోని యువతను సమీకరించి వారితో "మీగ్రామ అవసరాలను, మీరు తీర్చుకొనకపోతే యింకెవరు తీరుస్తారు! బయట నుంచి ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూడకూడదు. మీ గ్రామప్రజలు, అందులో మీకుటుంబ సభ్యులందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలంటే, మీరే నడుము కట్టి సేవలు చేపట్టవలెను. జబ్బులు వచ్చిన తరువాత మందులీసుకొనేకంటే జబ్బులు రాకుండా వ్యాధులుసోకకుండా ఉండేటందుకు అవసరమయిన నిరోధక చర్యలు తీసుకుంటే, మనకే, మన గ్రామానికే,

మన కుటుంబానికే మంచిది" అని వారికి నచ్చచెప్పి, వారినందుకు కార్యోన్ముఖులుగా చేయవలెను. వెళ్ళిన గ్రామానికే మరల వెళ్ళుటకు సమయం చాలదు. అదీగాక గ్రామ సేవలోని ఆంతర్యం, దాని సఫలీకృతం ఆ గ్రామానికి సేవలు చేయించుట ద్వారా సాధించగలుగుతాము. గ్రామస్తులు వారి గ్రామమునకు వారు చేసుకునే సేవలకే గ్రామసేవ అని సరిఅయిన అంతరార్థం. గ్రామంయొక్క యువశక్తిని సన్మార్గంలో నడిపించి, గ్రామానికి సరయిన చైతన్యం కలిగించడం ద్వారా, వారిశక్తిని సద్వినియోగం చేసినట్లవుతుంది. ఇది వారిలో మానసిక మార్పును కలిగించి సరయిన గ్రామసేవకులుగా చేయుటయే గాక వారిలోని ఆధ్యాత్మిక చింతలను వెలికి తీసి, మనమంతా సోదరులం అనే భావన కలుగచేస్తుంది. తోటివారికి అవసరమైన సహాయం అందచేయాలనే తపన, సదాలోచన, సద్బుద్ధి కలుగచేస్తుంది.

గ్రామసేవకు వెళ్ళే వారిలో ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, వడ్రంగులు, డ్రైవర్లు (హెవీ వెహికిల్సు నడుపుటకు లైసెన్సు ఉన్నవారు వారి లైసెన్సులు తీసుకురావలెను) తాపీ పనివారు వారి పరిముట్లతో రావాలి. గ్రామంలోకూడా ఇట్టి వారుండవచ్చును. అది విచారణ ద్వారా తెలుసుకొని అవసరమగుచోట్ల వారి సేవలను కూడా ఉపయోగించుకొనవచ్చును.

గ్రామసేవ చేపట్టే రోజున తెల్లవారుఝామున గాని, ముందు రాత్రి గాని, అనువైన చోట్ల మన సంస్థయొక్క బ్యానర్లు, మంగళ తోరణాలు కట్టవలెను. ఇందు నిమిత్తమై కార్యక్రమాలు అనుకున్న రీతిగా సకాలంలో జరుపుటకు అవసరమైన పనులు చూచుటకు కొందరు సేవాదళ సభ్యులు ముందు రాత్రే గ్రామమునకు చేరుకొని గ్రామస్థులతో మాటలాడి అక్కడ మకాం చేయవలెను. ఏతా వాతా ఆ గ్రామ ప్రజలతో చక్కటి అనుబంధం ఏర్పడి వారిలో మనల గురించి మంచి భావన కలిగి మనకు పూర్తి సహకారాన్ని అందించుటకు దోహదమేర్పడును. గ్రామ పెద్ద చేత జ్యోతి ప్రజ్వలనం చేయించి, కొంచెం సేపు భజన చేసి స్వామి వారి పఠం ముందు దీక్షా ప్రార్థనలు, ప్రతిజ్ఞలు చేసి( వీటిని ప్రత్యేకముగా ఈ పుస్తకములోనే మరోచోట ఇవ్వబడినవి) కార్యక్రమమును ప్రారంభించవలెను.

# 4. త్రివిధ విభాగములు - సేవలు

## ఎ) ఆధ్యాత్మిక విభాగం :

1. బ్రహ్మముహూర్తకాలంలో లేచి ఓంకారం సుప్రభాతం, గ్రామ సంకీర్తనలు చేయుట ద్వారా మనం సాధించే ఫలితములను, వాటి విశిష్టతను తెలియచేసి గ్రామస్తులను కూడగట్టుకొని ఈ కార్యక్రమమును జరిపించవలెను.

2. స్వామి వారి జననం, లీలలు, వారి దివ్య సందేశాలు, దివ్యత్వం, మానవాళి కి వారు చేస్తున్న మహోపకారాలు మరియు సంస్థ చేస్తున్న కార్యక్రమాలను ప్రతిబింబించే చిత్రపత ప్రదర్శన (ఎగ్జిబిషన్) ఏర్పాటు చేసి, అందులోని విషయాలను గ్రామస్తులకు చక్కగా వివరించాలి.

3. గ్రామీణ మహిళలను కలుపుకొని సత్యసాయి వ్రతాలు, కుంకుమార్చనలు ఏర్పాటు చేయవలెను.

4. గ్రామస్తులతో కలిసి పాదుకల పూజ ఏర్పాటు చేయువచ్చును.

5. గ్రామములోని దేవాలయములు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు మొదలయినవి,వాటి యాజమాన్యం వారి అనుమతితో శుభ్రపరచి అవసరమైనచో రంగులు, వెల్ల వేసి మరమ్మత్తులు అవసరమయినచో అవి పూర్తి చేయవలెను.

6. ఇంటింట స్వామి వారి చిత్తరువు కార్యక్రమం కింద, గ్రామంలోని ఇండ్లను దర్శించి స్వామి వారి దివ్యత్వం తెలియ చేసి, ఉత్సాహం చూపి కోరుకున్న ఇండ్లలో భజనలు చేసి స్వామి వారి ఫోటోను, విభూతిని అందించవలెను.

7. స్వామివారి దివ్యత్వమును తెలియచేసే వీడియో చిత్రప్రదర్శన ఏర్పాటు చేయుట.

8. పల్లకీలో స్వామి వారిని అలంకరించి గ్రామవీధుల్లో భాజాభజంత్రీలతో నామసంకీర్తనతో ఊరేగించవలెను.

9. లిఖిత నామ జపం పుస్తకమునిచ్చి భగవన్నామమును వ్రాయుటకు ప్రోత్సాహపరచవలెను.

10. ఉత్సాహము చూపుచున్న వారికి భజనలు నేర్పవచ్చును.

11. అధ్యయన మండలులు ఏర్పాటు చేసి మంచి వక్తచే స్వామి వారి జన్మము, దివ్యలీలలు, అవతారోద్దేశ్యం, మానవాళికి చేస్తున్న మహోపకారాలు. మన

సంస్థ కార్యక్రమముల గురించి ప్రసంగం ఏర్పాటు చేయవచ్చును. చదవగలిగే వారికి పాత సనాతన సారధి పుస్తకాలు గాని, సాయి సాహిత్యం గాని ఉచితంగా అందచేయవచ్చును.

12. ఒకవైద్యుడు, పిల్లలకు ప్రత్యేకంగా ఆరోగ్యం మరియు పరిశుభ్రతల గురించి అందుకు తీసుకొనవలసిన చర్యలు గురించి ప్రేమపూర్వకమైన మాటలతో తెలియచేయవలెను. ప్రత్యేకించి దంతసంరక్షణ గురించి పిల్లలకు అర్థమయ్యే రీతిలో వివరించవలెను.

13. మతసామరస్యం : దైవం ఒక్కడే అని, మతములన్నియు అతనిని చేరుటకు మార్గములని, అన్ని మతములు సారము ఒక్కటే అని తెలియపరచి, అందరూ కలిసి, సోదర, సోదరీమణులుగా మెలగాలని బోధించవలెను. ఇందుకు చిన్న నాటికలు గాని, ప్రసంగాలుగాని ఏర్పాటుచేసి, దైవపితృత్వం-మానవసోదరత్వం గురించి తెలియ చేయవచ్చును.

__బి) సేవా విభాగం :__

1. గ్రామంలోని మురికి వాడలను శుభ్రపరచి, రోడ్లమీదున్న గుంటలను, మొరముతో పూడ్చి, ప్రజలు, బండ్లు తిరుగుటకు సౌకర్యం కలిగించే రోడ్ల మరమ్మత్తు పనులు చేపట్ట వలెను., తుప్పలు కొట్టుట మొదలగునవి చేయించ వలెను.

2. గ్రామంలోనున్న నూతులలో, చెరవులలోనున్న పూడిక తీయుట గ్రామంలోని, నీళ్ళ ట్యాంకులను శుభ్రముగా కడుగుట, నీటిని శుభ్రముగా ఉంచుటకు అవసరమైన రసాయన మందులు, వాటికి నిర్ణయించబడిన మోతాదు తెలుసుకొని కలుపవలెను. మంచినీరుగా వాడుచున్న చెరువులలో బట్టలనుతుకుట, పశువులను కడుగుటవంటి పనులను నివారించవలెను.

3. గ్రామస్థుల అవసరనిమిత్తము అందరికి అందుబాటులో మరుగుదొడ్లను కట్టించుట, ప్రస్తుతమున్న మరుగుదొడ్లను శుభ్రపరచుట. మురుగు కాలువలను శుభ్రపరచి, నీరు నిలువకుండా ప్రవహించే ఏర్పాటు చేయవలెను. అవసరమున్న చోట్ల ఇంకుడు గొట్లను ఏర్పాటు చేయవలెను. డి.డి.టి., బ్లీచింగు పౌడరు మొదలగు క్రిమి సంహారక మందులను మురుగు కాల్వలలోనూ, మరుగుదొడ్ల

లోనూ చల్లవలెను.

4. కూరగాయలు, పండ్ల విత్తనాలు, మొక్కలు, జిల్లా కేంద్రంలోని నేషనల్ సీడ్సు కార్పోరేషను వారినుండి సేకరించి గ్రామస్తులకు వాటిని పండించుటకు అందచేసి వారు ప్రతిరోజు వాడుచున్న డిటర్జంట్లు కలవని నీరు ఈమొక్కలకు చేరునట్లు చేయువలెను. గ్రామంలోని రోడ్లకు రెండు ప్రక్కలనూ, దొడ్లలోనూ, ఖాళీ జాగాలలోనూ చెట్లు నాటించవలెను. దొడ్లలో మొక్కలు నాటుటలో ముఖ్యంగా కొబ్బరి, మునగ, కరివేపాకు మొక్కలకు ప్రాధాన్యతనీయవలెను.

5. గాలి, నీరు యొక్క కాలుష్యాన్ని గురించి వాటి దుష్పరిణామాల గురించి గ్రామస్తులకు తెలియచేసి వాటి నివారణకు, నియంత్రణకు తీసుకోవలసిన చర్యలు, జాగ్రత్తల గురించి తెలియచేయవలెను.

6. గ్రామకూడలిలో రచ్చబండ (చబూత్ర) కట్టించుట, బోరింగుపంపుల దగ్గర నీరు నిలువఉండక, సక్రమంగా ప్రవహించుటకు కాలువలు నిర్మించవలెను.

7. ఆరోగ్యకరమైన అలవాట్లు :

ఎ) చుట్టు ప్రక్కల పరిసరాలను శుభ్రముగా ఉంచుకొనుట ద్వారా వ్యాధిని కలిగించే క్రిమికీటకాదులకు చోటు లేకుండా చేయవలెను. ప్రతి రోజు స్నానం చేయవలెను. దీనివలన చర్మవ్యాదులు రాకుండా నివారించవచ్చును.

బి) బయటినుంచి ఇంటిలోనికి వచ్చునప్పుడు, భోజనమునకు ముందు మరియు తరువాత కాళ్ళు చేతులను శుభ్రముగా కడుగుకొనవలెను. మల విసర్జన తరువాత చేతులను సబ్బుతోగానీ, బూడిదతో గానీ శుభ్రముగా కడుగుకొనునట్లు భోధించవలెను.

సి) చేతులు, కాళ్ల గోళ్ళను కత్తిరించి తద్వారా అచ్చుట మట్టిగాని, బ్యాక్టీరియా గానీ చేరకుండా చూడవలెను.

డి) తలకు శుభ్రముగా నూనె రాసి దువ్వుకొనుట ద్వారా పేలు, చుండ్రు మొదలగునవి చేరుటకు అవకాశం లేకుండా చేయవలెను.

ఇ) పిల్లలకీయువలసిన పోషకాహారం గురించి తెలియచేసి సాయి ప్రొటీనును పంచుట.

సాయి ప్రొటీను చేయు విధానం :

| | | |
|---|---|---|
| వేయించిన గోధుమలు | : | 400 గ్రాములు/ 400 గ్రాములు |
| వేయించిన పెసలు/కాబూలీ చెన్న | : | 300 గ్రాములు / 200 గ్రాములు |
| పంచదార / బెల్లం | : | 200 గ్రాములు / 100 గ్రాములు |
| వేయించిన వేరుశనగలు | : | 100 గ్రాములు / 100 గ్రాములు |
| వేయించిన తెల్ల నువ్వులు | : | 100 గ్రాములు / నిల్ |

పంచదార తప్పించి తక్కినవన్నీ విడివిడిగా వేయించి మెత్తటి పొడిగా విసరవలయును. తరువాత పంచదార పొడిని వాటితో కలపవలెను. మంచి వాసన కొరకు ఏలకులు, ఎండు అల్లం 5 గ్రాముల చొప్పున పిండి చేసి కలుపవలెను. అవసరమయినచో అవి ముద్దగా ఉండుటకు బెల్లం కలుపవచ్చును. రెండేసి చెమ్చాలు ఉదయం, సాయంకాలం యిచ్చునట్లు చూడవలెను.

ఎఫ్) ఇంటింటా ఆరోగ్యం, పరిశుభ్రత పథకం క్రింద సాయిసేవకులు జట్లు జట్లుగా ప్రతి యింటిని సందర్శించి వారికి తీసుకోవలసిన చర్యలు, పోషకాహారం ప్రాముఖ్యతను గూర్చి తెలియచేయవలెను.

జి) గ్రామాలలో పరిశుభ్రతను పాటించి, చక్కని అలవాట్లున్న వారిని ఎంపిక చేసి మెమెంటోలనిచ్చి ప్రోత్సాహపరచవలెను.

**8. వైద్య సేవలు :**

ఎ) గ్రామస్తులకు వైద్య శిబిరాల ద్వారా పరీక్షలు జరిపి, వ్యాధిని నిర్ణయించి తగిన మందులు యిచ్చి ఉచితముగా వైద్యము చేయవలెను.. దీర్ఘ వ్యాధులతో బాధపడుచున్న వారిని గుర్తించి వారికి ప్రత్యేక వైద్యసేవలు అందచేయచేయవలెను. అందులో ముఖ్యంగా గుండె, కన్ను, మూత్రాశయం, కిడ్నీలకు సంబంధించిన వ్యాధులున్నవారిని అవసరమైనచో చికిత్స పొందుటకు ప్రశాంతి నిలయములో వున్న సూపర్ స్పెషాలిటి హాస్పిటలుకు పంపవలెను.

బి) పిల్లలలో కలిగే సీజనల్ జబ్బులు రాకుండ వుండుటకు అవసరమైన వ్యాధి నిరోధక మందులివ్వవలెను.

సి) గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియచేయవలెను.

డి) చంటి పిల్లలలో వచ్చే పోలియో, హెపటైటిస్, డిపిటి పొంగు, టైఫాయిడ్

మొదలగు వ్యాధులు సోకకుండా ఉండుటకు యిచ్చే టీకాలు, ట్రిపిలాంటిజిన్ మరియు యితర వ్యాక్సినేషన్లకు సంబంధించిన చార్టును యిచ్చి సకాలంలో వారికీయవలసిన మందులు యిచ్చే ఏర్పాటు చేయవలెను.

ఇ) పిల్లలు మట్టిలో ఆడుట వలన వచ్చే వ్యాధుల గురించి తల్లిదండ్రులకు వివరించి వాటి నివారణకు తీసుకొనవలసిన జాగ్రత్తలు తెలియజేయవలెను.

ఎఫ్) బడిపిల్లలకు వైద్య పరీక్షలు చేసి వారిలోని జబ్బులను ఆరోగ్య సమస్యలను పరీక్షించి తగిన సూచనలిచ్చి వైద్య సదుపాయం ఏర్పాటు చేయుటమే కాక దంత వైద్య శిబిరం, కంటి పరీక్షలు కూడా ఏర్పాటు చేయవలెను.

జి) రక్త దానమునకై పరీక్షలు : ఇందుకు గ్రామములోని **40** సంవత్సరములోపు యువకులను ప్రోత్సహించి ముందుకు వచ్చిన వారి రక్తం, ఏ గ్రూపుకు చెందినదో నిర్ధారించి వారికి తెలియచేసి వారి పూర్తి వివరములతో రికార్డును మన వద్ద ఉంచుకొనవలెను. వారి గ్రూపుకు సంబంధించిన రక్తము అవసరమున్న రోగులకు చికిత్సార్థం యీయవలెనని వారికి నచ్చచెప్పవలెను. వారి ఆరోగ్యం కొరకే రక్తమును దానం చేయవలెనని, అట్లుకాని యెడల రక్తం వారి శరీరంలోనే విచ్ఛిన్నం అగునని, అట్లుగాక అవసరమున్న రోగికి దానం చేసిన సాటి మనిషి ప్రాణమును నిలబెట్టిన వారవుతారు. రక్తదానం వలన వారిదేహానికి, ఆరోగ్యానికి ఎట్టి యిబ్బంది కలగదని ఒక్కటి రెండు రోజులలోనే మనం తినే ఆహారం ద్వారా ఆ లోటును భర్తీ చేయవచ్చునని తెలియ చేయవలెను.

హెచ్) మనకు సంక్రమించే వ్యాధులు ఈక్రింద తెలిపిన వాటి ద్వారా సంక్రమిస్తాయి. అవి **1.** కలుషిత గాలి **2.** కలుషిత నీరు **3.** అంటు వ్యాధులు **4.** కలుషిత ఆహారం **5.** మత్తు పానీయాలు మరియు దురలవాట్లు **6.** మెదడు, శరీరానికి తగు వ్యాయామం లేకపోవడం. వీటిని నిరోధించి మన ఆరోగ్యాన్ని కాపాడుకొనుటకు తీసుకోవలసిన చర్యలు తెలియచేయాలి.

ఈ శిబిరములలో రోగులను వరుసక్రమంలో ఒకరి తరువాత ఒకరిని పంపే ఏర్పాటు చేయవలెను. అంతే కాక ఓ.పి. చీటీల మీద మన సంస్థ, సేవాసమితి ముద్రలు తప్ప ఇతరములు ఉండకుండా చూడవలెను.

9. పశువైద్య సేవలు : ఇవి ముఖ్యముగా గ్రామాలలో చాలా అవసరం. గ్రామస్తులు, కొంతవరకు వారితో పాటు పట్టణ ప్రజల జీవితం పశువులపై ఆధారపడియున్నది. అవి వాటి బాధను చెప్పుకోలేని మూగ జీవులు. కావున వీటిని పరీక్ష చేసి, వ్యాధి నిర్ధారణ చేసి తగిన చికిత్స చేయవలెను. వ్యాధులు రాకుండుటకు, వచ్చిన వ్యాధులు వ్యాప్తి చెందకుండుటకు తీసుకోవలసిన నిరోధక చర్యలు తెలియచేయాలి. పశువులలో వచ్చే వ్యాధులు మనం త్రాగే పాల ద్వారా మనకు సంక్రమించకుండుటకు, వాటికి సకాలంలో తగిన చికిత్స చేయించవలెను.

10. రైతు గోష్ఠులు : ఇవి ఏర్పాటు చేసి రైతులకు పంట దిగుబడి పెరుగుట కు, మేలు రకపు విత్తనాల కొరకు, పంటలకు తెగులు రాకుండుటకు తగిన జాగ్రత్తలు, తెగులు వచ్చినచో వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలు, తత్సంబంధిత ప్రభుత్వాధికారులతో సమావేశమేర్పరచి వారిచే గ్రామస్థులకు చక్కగా వివరించవలెను. రైతులు ఎదుర్కొనే యిబ్బందులు, వాటికి నివారో ణాపాయాలను, చేతికందిన పంటకు నాణ్యమైన గిట్టుబాటు ధరలు పొందుట కు సరైన మార్గములు తెలుపవలెను. ఉత్పత్తిదారునుంచి వినియోగదారునకు మధ్య దళారీలతో ప్రమేయం లేకుండా నేరుగా అమ్మే ఏర్పాట్లు తెలుపవలెను.

రైతులు మరియు గ్రామస్తుల అభివృద్ధికి సహాయపడే ప్రభుత్వం తల పెట్టే కార్యక్రమముల గురించి, గ్రామస్తులకు తెలియచేసి వారు లబ్ధి పొందేట ట్లు చూడవలెను. అవసరమైనచో గ్రామస్తులకు ప్రభుత్వం వారికి మధ్య లైజాను పని (మధ్యవర్తిత్వం) చేయవచ్చును. ఇది మన సేవ కింద చూపించకూడదు.

11. ఆరోగ్య సూత్రములు – ఇతరములు :

1. ఆహార పదార్థముల ద్వారా వ్యాధులను వ్యాపింపచేసే ఈగలు, దోమలు మొదలగు క్రిమికీటకాదులనుండి తప్పించుకొనుటకు తీసుకొనవలసిన చర్యలు తెలియచేయాలి.

2. రాజశిక, తామశిక గుణములను పెంచి ఆరోగ్యమునకు హాని కలిగించే ఉప్పు, పులుపు, మసాలా దినుసులు, కారము తగ్గించి పాలు, పండ్లు, కూరగాయలు మొదలగు సాత్వికాహారం తీసుకున్న ఆరోగ్యం మెరుగుపడునని

తెలియచేయాలి

3. రక్షిత నీరు త్రాగుట, నీరు కాచి చల్లార్చి, వడగట్టి త్రాగుట వలన నీటిద్వారా వచ్చే వ్యాధులను చాలా వరకు నివారించవచ్చునని తెలియచేయాలి.

4. మత్తు పానీయాలు సేవించుట వలన దేహానికి, మనసుకు, బుద్ధికి, ఇంటికి కలుగజేసే కష్ట, నష్టాలను తెలియచేసి ఆ దురలవాట్లను మానుకోవాలని తెలియ చేయాలి.

5. పొగ త్రాగుట వలన ఊపిరితిత్తులకు, గుండెకు, మెదడుకు కలిగే జబ్బులను తెలియజేసి వాటిని దూరంగా ఉంచవలసిన అవసరమును తెలియచేయాలి.

6. మాంసాహారం సేవించుట వలన మనలో పశుగుణములు పెంపొందుతాయి గాన వాటిని దూరంగా ఉంచవలసిన అవసరం తెలియచేయాలి.

7. టీ, కాఫీలు ఎక్కువగా సేవించుట వలన కలిగే నష్టాలను తెలియచేసి, పూర్తిగా మానలేని యెడల మితముగా సేవించుట మంచిదని తెలియచేయాలి.

8. గ్రామాలలోని యువకులు పేకాట మొదలగు జూదములకు ఆకర్షితులై డబ్బును, కాలమును దుర్వినియోగ పరచి అనారోగ్యమునకు గురవుచున్నారు. వాటితో పాటు ఇతర దుర్వ్యసనాలకు బానిసలవుతున్నారు. దాని వలన కలిగే కష్ట, నష్టాలను తెలియచేసి వారి కాలమును, ధనమును, శక్తిని, సద్వినియోగ పరచుటకు, సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొనుటకు ప్రోత్సాహించాలి.

9. అన్నిటికంటే ముఖ్యమైనది. మితాహారము, మితభాష అని తెలియ చేయాలి. (ఒక వేళ గ్రామసేవలు మహిళలు మరియు పురుషులు చేరి చేస్తున్న సమయంలో ఇరువురు చేరి మాట్లాడడం సంస్థ సిద్ధాంతములకు వ్యతిరేకము అని గుర్తించి నడుచుకొనవలెను. సాధ్యమైనంతవరకు ఎవరి సేవలు వారే విడివిడిగా చేసుకొనవలయును).

10. కోర్కెలపై అదుపు గురించి తెలియచేసి అందువలన కలిగే మానసిక శాంతిని, తెలియ పరచి తద్వారా, పొదుపు చేయగలిగిన సొమ్మును తమకు అత్యవసర కార్యక్రమాలకు గాని, సమాజసేవకు గాని వినియోగించుకోవచ్చునని తెలియచేయాలి. ఇది మన అధ్యాత్మికాభివృద్ధికి తోడ్పడి అంతిమ

గమ్యానికి చేర్చే చక్కటి నావ. స్వామివారు ఇది మనకందించిన మహావరం.

**11.** స్వయం ఉపాధి పథకం క్రింద తగిన శిక్షణనిచ్చి వారి జీవన సరళిని మెరుగు పరుచుటకు సహాయము చేయాలి.

**12.** వృత్తి శిక్షణ కార్యక్రమం క్రింద బీద గ్రామీణులకు శిక్షణనిచ్చి వారికి అవసరమైన పరికరములను అందచేసి వారికి ఉపాధి కల్పన ఏర్పాటు చేయవచ్చును.

**13.** పైన తెలిపిన కార్యక్రమాల నిర్వహణలో యిచ్చిన సూచనలను పాటించు

14. గ్రామాలలోని పాడయిపోయిన గొట్టపు బావులను మరమ్మత్తుచేసి తిరిగి బాగా పనిచేయించగల ఇంజనీర్లు మన సంస్థలో ఉన్నారు. వారి సేవలను ఉపయోగించుకొని గ్రామాలలోని అన్ని గొట్టపు బావులను పనిచేసే స్థితికి తేవలయును. ఈ విషయంలో అమీరుపేట, హైదరాబాదులో నున్న శ్రీ శ్రీనివాసరావు గారు చాల అనుభవ-మున్నవారు. టెలిఫోన్ నెం. 3730203 ద్వారా వారి సలహా సంప్రదింపులు పొందవచ్చును. అవసరమయితే పాడయిపోయిన పంపుల వివరాలు ఏ గ్రామానికి సంబంధించినవో తెలియచేసి, వారిని స్వయముగా రమ్మనమని కోరవచ్చును.

కప్పుడు [illegible]

**3.** కాలేజి, హైస్కూలు విద్యార్థులకు ఆధ్యాత్మిక నైతిక అంశముల మీద వ్యాస రచన, వక్తృత్వపు పోటీలు ఏర్పాటు చేయవచ్చును.

**4.** ఎగ్జిబిషను, క్విజ్ (ఆధ్యాత్మిక సంబంధమైనవి) ఆనంద జ్యోతి కార్యక్రమములు ఏర్పాటు చేయవలెను.

**5.** గ్రామములోని యువతీ, యువకులను ప్రోత్సాహపరచి ఉత్సాహం చూపుచున్న వారిని స్వామి దర్శనార్థం ప్రశాంతి నిలయం తీసుకొని వెళ్ళవలెను.

**6.** సాంఘిక దురలవాట్లైన మత్తుపానీయాలు, పొగ త్రాగుట, అతిగా టీ, కాఫీలు

గమ్యానికి చేర్చే చక్కటి నావ. స్వామివారు ఇది మనకందించిన మహావరం.

11. స్వయం ఉపాధి పథకం క్రింద తగిన శిక్షణనిచ్చి వారి జీవన సరళిని మెరుగు పరుచుటకు సహాయము చేయాలి.

12. వృత్తి శిక్షణ కార్యక్రమం క్రింద బీద గ్రామీణులకు శిక్షణనిచ్చి వారికి అవసరమైన పరికరములను అందచేసి వారికి ఉపాధి కల్పన ఏర్పాటు చేయవచ్చును.

13. పైన తెలిపిన కార్యక్రమాల నిర్వహణలో యిచ్చిన సూచనలను పాటించుటకు ఎదురయ్యే యిబ్బందులు తొలగించుటకు తత్సంబంధిత ప్రభుత్వ యంత్రాంగముతో సంప్రదింపులు జరిపి వారి సహాయ సహకారలు అందేటట్లు చూడవలెను.

<u>సి) విద్యా విభాగం :</u>

1. బాల వికాస్ మోడల్ తరగతులను నిర్వహించి బాల వికాస్ తరగతుల ద్వారా, పిల్లలలో కలిగే చైతన్యం, క్రమశిక్షణ, దైవభక్తి, తల్లిదండ్రులు, పెద్దల యందు కలిగే గౌరవం, వారికి అలవడే నీతి, నిజాయితీ గురించి తల్లిదండ్రులకు తెలియచేసి వారి పిల్లలను బాలవికాస్‌లో చేర్పించుటకు ప్రోత్సాహపరచి, వీలయినచో ఆగ్రామములోనే బాలవికాస్ తరగతులను ప్రారంభించుటకు ప్రయత్నము చేయవలెను. ఇందుకు కావలసిన పాఠ్య పుస్తకములు మనమే వారికి ఉచితముగా అందించుట మంచిది.

2. గ్రామంలోని పిల్లలను చేర్చి నీతిని బోధించే చిన్నచిన్న నాటికలను అప్పటకప్పుడు నేర్పి వారిచే ప్రదర్శించవచ్చును.

3. కాలేజి, హైస్కూలు విద్యార్థులకు ఆధ్యాత్మిక నైతిక అంశముల మీద వ్యాస రచన, వక్తృత్వపు పోటీలు ఏర్పాటు చేయవచ్చును.

4. ఎగ్జిబిషను, క్విజ్ (ఆధ్యాత్మిక సంబంధమైనవి) ఆనంద జ్యోతి కార్యక్రమములు ఏర్పాటు చేయవలెను.

5. గ్రామములోని యువతీ, యువకులను ప్రోత్సాహపరచి ఉత్సాహం చూపుచున్న వారిని స్వామి దర్శనార్థం ప్రశాంతి నిలయం తీసుకొని వెళ్ళవలెను.

6. సాంఘిక దురలవాట్లైన మత్తుపానీయాలు, పొగ త్రాగుట, అతిగా టీ, కాఫీలు

సేవించుట వలన కలిగే దుష్పరిమాణాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్ర మాలను నిర్వహించి అట్టి దురలవాట్లనుండి తప్పించుకోవలసిన అవసరం తెలియచేయాలి.

7. మానవతా విలువల గురించి వాటిని పెంపొందించుకొనే అవసరం గురించి తెలియచేయాలి.

8. గ్రామములోని యువతీ యువకులకు ఆటలపోటీలను ఏర్పరచి వారిలోని క్రీడాశక్తిని, గ్రహణశక్తిని అభివృద్ధి పరచవచ్చును. పాటల పోటీలను ఏర్పరచి వారిలో సంగీతం, నృత్య కళాభిరుచులను పెంపొందించవచ్చును. మహిళలకు రంగోలి పోటీలు ఏర్పాటు చేయవచ్చును. ఈ కార్యక్రమాలలో బాగా మెప్పించ గలవారిని బహుమతులనిచ్చి ప్రోత్సాహపరచవలెను.

9. గ్రామీణ బాల వికాస్ : గ్రామంలో బాలవికాస్ యూనిట్టు ఏర్పరచి గ్రామం లోని పిల్లలకు నీతిని బోధించే కథలు, రామాయణ, భారత, భాగవతములకు సంబంధించిన కథలు, ఆరోగ్య సూత్రములు, పిల్లలు తీసుకొనవలసిన జాగ్రత్తలు బోధించవలెను.

10. వయోజన విద్య : గ్రామాలలో నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్నది. అక్షర జ్ఞానం వలన వారికి కలిగే మంచిని తెలియపరచి వారిని ప్రోత్సాహపరచి, ఈ కర్యాక్రమం క్రింద వారికి అవసరమైన శిక్షణను ఇప్పించవలెను.

11. పైన తెలిపినవి గాక, క్రొత్త విషయాలేమైనా సభ్యుల దృష్టికి వచ్చినచో వాటిని మీరు ఆచరణలో పెట్టి వివరములు ఇతర సమితులకు తెలియచేసినచో వారికి కూడ ఆచరించుటకు అవకాశం కలుగును. చక్కటి స్పందన కలిగిన గ్రామములో మన భజన కేంద్రములను ప్రారంభించి గ్రామములలో ఇంకా ఎక్కువగా కార్యక్రమముల అభివృద్ధికి తోడ్పడవచ్చును.

డి) ఇతరములు :

1. పైన సూచించిన కార్యక్రమాలే గాక కొన్ని గ్రామాలలో ప్రత్యేక అవసరాలు వుండవచ్చును. మీ వీలును, ఆర్థిక పరిస్థితి, మానవ వనరులు బట్టి ఆ గ్రామ పరిస్థితులను బట్టి చేయగలిగిన కార్యక్రమాలను చేపట్టవలెను. సేవాదళ సభ్యులలో ఒకరిద్దరికి గ్రామంలోని కార్యక్రమములు అనుకున్నట్లు జరువు

టకు మనం సూచించిన ప్రకారం గ్రామస్తులు ముఖ్యంగా యువతీ, యువకులు గ్రామానికి అవసరమైన పనులు ఒప్పుకున్నవి చేపట్టి నిత్యము ఆ పనులు జరిగే టట్లు చూచే బాధ్యతను అప్పచెప్పవలెను. ప్రతి సంవత్సరం అక్టోబరు 20వ తేదీన స్వామి అవతార ప్రకటన దినం కావున బ్యాచిల వారీగా మనం సేవలు చేసిన గ్రామాలను దర్శించి అవసరమైన సలహాలను అందించవచ్చును.

2. గ్రామస్తులమీద ఎట్టి భారమును మోపరాదు. వారి ఆతిథ్యమును కూడ స్వీకరించరాదు. ఆ విషయమై వారికి బాధ కలుగకుండ మన సంస్థ నియమ నిబంధనలు అట్టి వాటికి నిషిద్ధమని మృదువుగా చెప్పవలెను. కార్యక్రమమున కవసరమైన సామాగ్రి అంతయు వైద్య, పశు వైద్య శిబిరాలకు అవసరమైన మందులన్నియూ మనమే సమకూర్చుకొని వెళ్ళవలెను.

3. వైద్య, పశు వైద్య సేవలకు సంబంధించి, గ్రామసేవల అనంతరం చేపట్టవ లసిన చర్యలలో భాగంగా ఒకరిద్దరు వైద్యులకు బాధ్యతలనిచ్చి మన ఓ.పి. టికెట్లున్నవారికి అవసరమైన ఉచిత వైద్య చికిత్స అందచేయునట్లు కోరవలెను.

## 5. మహిళా గ్రామ సేవలు

పురుషులతో పాటు మహిళలు కూడా సేవా కార్యక్రమాలలో పాల్గొం టున్నారు. ముఖ్యముగా ప్రతి నెల 19వ తేదీన మహిళల దినం గాన ఆ రోజు కొన్ని సమితులలో మహిళలు స్వతంత్రంగా వారే గ్రామాన్ని ఎన్నుకొని ఆ రోజున ఆ గ్రామములోని అన్ని రకములైన సేవలు గ్రామ సంకీర్తనతో మొదలు కొని, పల్లకీ సేవ, సాంస్కృతిక కార్యక్రమములను మహిళలే నిర్వర్తిస్తున్నారు. నిజంగా కొన్ని కొన్ని కుటుంబ సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో మహిళలే పట్టుదలతో పురుషులకంటే ఎక్కువగా సాధిస్తున్నారు.

ఉదా : కోళ్ళలపై అదుపు, పెరటిలో కూరగాయలు పండించుట, వ్యాధినిరోధక చర్యలు పాటించవలసిన ఆరోగ్య సూత్రాలు, ఇంటింట స్వామి చిత్తరువు, పోషకాహారం పంపిణీ మొదలగునవి. గ్రామ సేవలలో మహిళల పాత్ర అత్యంత శక్తివంతమైనది, ప్రధానమైనది. కావున వారిని ప్రోత్సా హించి అవకాశం కల్పిస్తే వారు సాధించలేనిదేమి లేదు. గ్రామసేవలలో పాల్గొనే పురుషులు ఈ విషయాన్ని గుర్తించి మహిళలకు ఎక్కువ అవకాశం యీయ వలెను. మహిళలు స్వతంత్రంగా యీ సేవలు చేపట్టినప్పుడు రక్షణ కొరకు కొంతమంది పురుషులు వారి వెనక ఉండవచ్చును. కాని ప్రత్యేకంగా కోరితే తప్ప వారు మహిళా గ్రామసేవలలో పాల్గొనే అవసరం లేదు.

## ౬. ఇతరములు

**ఐక్యత :**

ఇది లోపించుట వలన మన దేశ పరిపాలన విదేశీయులకు అప్పచెప్ప డం అయినది. ప్రస్తుత దేశ పరిస్థితి కూడా అనైక్యతే కారణం. ఈ కల్లోల పరి స్థితికి కారకులు ఎవరయినప్పటికి దాని దుష్పరిణామాలను మనమందరం అను భవిస్తున్నాం. ఈ ఐక్యత అనేది కొంతవరకు గ్రామసీమలలో కనిపిస్తున్నది. గ్రామ ప్రజలకు అందులో ముఖ్యంగా యువతకు అనైక్యత వలన కలిగే వినాశ నాన్ని వాళ్ల మనస్సుకు హత్తుకొనేటట్లు బోధపరచి మనమంతా ఒక్కటే అని తెలియచేసి ఐక్యతాభివృద్ధికి పాటుపడవలెను. ఐక్యతతోనే మన దేశ సమగ్రాభి వృద్ధి, సిరిసంపదలు ముడిపెట్టబడియున్నవి. ఐక్యతతోనే మన స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకొనవలసిన అవసరం ఎంతయినా ఉన్నదని తెలియపరచాలి అని స్వామివారు చెప్పినారు.

**భారతీయ సంస్కృతి :** మన సంస్కృతి చాలా గొప్పది. ఇట్టి సంస్కృతి ప్రపంచంలో మరెక్కడా లేదని స్వామి వారు చెప్పారు. అట్టి మన సంస్కృతిని కాపాడుకోవలసిన బాధ్యత భారతీయులమైన మనందరి పైన ఉన్నది. ఆధ్యా త్మికంగా భారతదేశం అన్ని దేశాలకు మార్గదర్శకంగా నిలచిందంటే యీ మన సంస్కృతే కారణం. దానిని మనం కాపాడుకోగలిగితే దేశ ఔన్యత్యాన్ని సాధించినట్లే. విదేశీయులు కూడా మన సంస్కృతిలోని గొప్పతనాన్ని గుర్తించి, దానిని అనుసరించే ప్రయత్నం చేస్తున్నారు. కాని దీనిని మనం మరచిపోతున్నాం. అసలు దీని గురించి ఆలోచించుటయే లేదు. మన సంస్కృతి యింకా జీవించి యున్నదంటే దానికి కారణం మన దేశంలోని అసంఖ్యాకమైన గ్రామములే. కావున పల్లెలలోని యువతీ, యువకులకు మన సంస్కృతి యొక్క విశిష్టత, ఔన్యత్యమును వివరించి వారి మనసులను మన సంస్కృతివైపు మరల్చుటకు, దానిని పోషించుటకు కృషి చేయవలెను. అందుకే స్వామి వారు శలవిచ్చినారు. "భారతీయ సంస్కృతిని ఆచరించే వారందరూ భారతీయులే" అని.

**శ్రీ సత్యసాయి సేవా సంస్థ :**

సాక్షాత్తు భగవంతుడే యీ సంస్థ ద్వారా మన అభ్యుదయమునకు

అవకాశమిచ్చిన కార్యక్రమమే యీ గ్రామసేవ. మన జన్మాంతర సుకృతము వలన యీ సంస్థలో చేరి, మన కోసమే మన అహంకార నిర్మూలనకే యీ సేవ అనే రెండక్షరముల కార్యక్రమం చేపట్టాం. అందువలన ప్రేమతో యిక ఏయితర ఆపేక్షలు, అహంకార మమకారములు లేకుండా మనలను మనమే ఉద్ధరించు కొనుటకు స్వామివారి నామాన్ని మనసులో తలచుకుంటూ రెండు చేతులు సంఘసేవకు వినియోగించుట ద్వారా జన్మరాహిత్యం పొందాలి.

బాబావారి సందేశాలలో రెండు విషయాలు స్పష్టంగా గోచరించును. 1. ఆత్మతత్త్వం 2. సమాజ శ్రేయస్సు. ఆత్మతత్త్వం మనకు గోచరమయ్యేది సమాజ సేవ ద్వారానే. మొదటిది ప్రేమమయం, రెండవది సేవమయం. ఈరెంటి ద్వారా మన జన్మసాఫల్యం అవుతుంది.

<u>ప్రత్యేక గమనిక :</u>

1. గ్రామ సేవా కార్యక్రమములు. మన సంస్థ బ్యానరు కింద మనమే చేపట్టవలెను. మన సమితులు ఒకరికొకరు సహకరించుకొని గ్రామ ప్రజలను కూడ గట్టుకొని జయప్రదం చేయాలి. ప్రైవేటు మరియు ఇతర ఆధ్యాత్మిక, సాంఘిక సంస్థలతో గాని ప్రభుత్వం వారు తలపెట్టే కార్యక్రమాలతో గాని, మనకు ఎట్లాంటి సంబంధము ఉండకూడదు. మన శక్తిని బట్టి కార్యక్రమములను నిర్వహించవలెను.

2. గ్రామ సేవలలో పాల్గొనే యువత దాని వల్ల చేకూరే మంచిని, మానసిక వికాస పెంపుదలను మరియు ఈ శరీరం వచ్చినది పరోపకారం కోసమేనని, యిందుకు వెచ్చించిన కాలం సద్వినియోగం అని తల్లిదండ్రులకు నచ్చచెప్పి, వారిని ఒప్పించి యిందులో ప్రవేశించాలి.

3. మనం ఏ కార్యక్రమమైనా ప్రారంభించే ముందు భగవంతుని ప్రార్థించి మొదలు పెడతాం. తద్వారా భగవంతుని ఆశీస్సులు కలిగి ఎట్టి ఆటంకము లేకుండా కార్యక్రమం జయప్రదమవుతుందని నమ్మిక, అనుభవం. ఆ విధము గానే గ్రామ సేవా కార్యక్రమములు మొదట భగవంతుని ప్రార్థనతో ప్రారంభించాలి. ఈ కార్యక్రమం జరిపించుటకు మనలో ప్రేరణ కలిగించినది వారేనని, మనలను పనిముట్టుగా వాడి, కార్యక్రమములను నడిపి, జయప్రదం

గావించేదీ వారేనని ప్రగాఢ విశ్వాసంతో మనసా, వాచా కర్మణా కార్యక్రమమును ఆచరణలో పెట్టాలి.

సర్వం భగవదర్పితం చేసి స్వామివారి అడుగుజాడల్లో నడచుటయే మన కర్తవ్యం. అప్పుడు అనుకున్న పనులన్నీ కర్తృత్వభావం కలుగకుండా యథావిధిగా జయప్రదమగుటయేకాక అహంకారం తల ఎత్తకుండా ఉండుటకు తోడ్పడును.

## 7. గ్రామదర్శిని

ఇది కూడా గ్రామములకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమము. స్వామివారి 75వ జన్మదినం నాటికి శ్రీ సత్యసాయి అవతారం భూమిమీద అవతరించినదని, మానవాళిలో చైతన్యాన్ని కలిగించి మానవుడు ఎందుకు జన్మించాడో తెలుసుకొనడానికి మార్గం అందించి స్వస్వరూప దర్శనం కలిగించుటకై అవతరించిన మూర్తి శ్రీసత్యసాయిబాబా అని అందరికి తెలియచెప్పాలి. దీనిలో భాగంగా ఆయన మానవాళికి చేస్తున్న మహోపకారాలు తెలియచేసి, మన విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చుటకు మార్గం చూపిస్తున్న మహానీయులు, అవతార మూర్తి అయిన స్వామి దివ్యత్వాన్ని వారి సందేశాన్ని అందరికి తెలియ చెప్పే పథకం ఇది. వారి సందేశం యింటింటికి తెలియ చేయాలని అన్నప్పుడు ఇంటింటికి కాదు. ఇంచి ఇంచికి అని సరి చేశారు. ఈ కార్యక్రమం కింద గ్రామాన్ని దర్శించి గ్రామస్తులతో సంప్రదించి, అచ్చుట రచ్చబండను గాని, దేవాలయాన్ని గానీ కార్యక్రమములు జరుపుటకు ఎన్నుకొని గ్రామస్తులను కలుపుకొని అచ్చుటనుండి గ్రామసంకీర్తనతో కార్యక్రమాన్ని ప్రారంభించి, భజన చేసి మంచి వక్తచే స్వామి వారి మహత్తును, అవతార ఉద్దేశ్యమూ, మానవాళికి వారందించిన సేవలు మొదలగు వాటి గురించి తెలియచేసి వీలైతే స్వామి వారి దివ్యత్వమును తెలియచేసే వీడియో క్యాసెట్టును ప్రదర్శించి కార్యక్రమము ను పూర్తి చేయాలి. వీలున్న యెడల చిన్న సేవా కార్యక్రమములు, వీధులను, మురికి కాలువలను శుభ్రపరచుట, ఇంటింటి స్వామి చిత్తరువు మొదలగునవి చేపట్టవచ్చును. ఇవి విరివిగా మన సేవా కార్యకర్తలందరూ భజన మండలులతో సహా చేపట్టదగిన కార్యక్రమం. సమితికి, సమితికి మధ్యనున్న గ్రామములన్నియూ ఈ కార్యక్రమం క్రింద దర్శించాలి. ఒకరితో ఒకరు సహకరించుకొని మొత్తం మీద వారి జిల్లాలోని అన్ని గ్రామాలను దర్శించవలెను. మన భజనమండలి గాని, సమితి గాని ఉన్నచోట్ల గ్రామసేవలు గాని, గ్రామదర్శిని గాని చేపట్టనవసరం లేదు. గ్రామ సేవ చేసిన గ్రామాలలో గ్రామదర్శిని కార్యక్రమం అవసరం లేదు. మొత్తం మీద గ్రామములన్నియూ పై కార్యక్రమాలలో ఏదో ఒక దానికి పూర్వం సందర్శించాలి అనేదే ఈ కార్యక్రమ ధ్యేయము.

గ్రామసేవలలో ఇచ్చిన సూచనలు ముఖ్యంగా ప్రత్యేక గమనిక క్రింద ఐటము 1 లో ఉదహరించిన విషయము పాటించవలెను.

## 8. నివేదిక

కార్యక్రమం చేయుట ఎంత ముఖ్యమో దాని గురించి నివేదిక పంపుట అంత ముఖ్యం గ్రామసేవ, గ్రామదర్శిని కార్యక్రమముల నమూనా నివేదిక పత్రములు క్రింద ఇవ్వబడినవి.

నమూనా నివేదిక – 1

<u>గ్రామ సేవ కార్యక్రమ నివేదిక :</u>

1. సమితి పేరు
2. గ్రామం పేరు
3. మండలం పేరు
4. జిల్లా
5. గ్రామ జనాభా
6. సేవ చేసిన తేది

సేవా వివరములు :

1. ఆధ్యాత్మిక విభాగం
2. సేవా శిభాగం
3. విద్యా విభాగం

| | యువత | ఇతరులు |
|---|---|---|
| 4. పాల్గొన్న సేవాదళ సభ్యులు | పు. స్త్రీలు | పు. స్త్రీలు |
| | యువత | ఇతరులు |
| 5. పాల్గొన్న స్థానికులు | పు. స్త్రీలు | పు. స్త్రీలు |

6. లబ్ధి పొందిన వారి సంఖ్య
7. గ్రామస్తుల స్పందన
8. స్పందన బాగున్న చోట్ల మన కేంద్రమును ప్రారంభించుటకు ప్రయత్నం చేస్తున్నారా?
9. వైద్య / పశు వైద్య శిబిరాలకు సంబంధించినంత వరకు పాల్గొన్న డాక్టర్ల సంఖ్య, చికిత్స పొందిన వారి సంఖ్య తెలుప వలెను.
10. రైతు గోష్ఠిలో పాల్గొన్న ప్రభుత్వాధికారుల, రైతుల సంఖ్య తెలుప వలెను.
11. బాలవికాస్‌కి సంబంధించిన కార్యక్రమాలలో పాల్గొన్న గురువులు, బాల

బాలికల సంఖ్య తెలుప వలెను.

12. స్పందన (బాగున్నచో బాల వికాస్ యూనిట్లును ప్రారంభించవచ్చును.)

13. వయోజన విద్య కార్యక్రమం క్రింద పాల్గొన్న గురువులు, వయోజనల సంఖ్య.

తేది. సమితి కన్వీనరు సంతకం

నమూనా నివేదిక – 2

<u>గ్రామదర్శిని కార్యక్రమ నివేదిక :</u>

1. సమితి / భజన మండలి పేరు
2. దర్శించిన గ్రామం పేరు
3. మండలం పేరు
4. జిల్లా పేరు
5. గ్రామ జనాభా
6. దర్శించిన తేది
7. పాల్గొన్న సేవాదళ్

| | యువత | ఇతరులు | పాల్గొన్న స్థానికులు |
|---|---|---|---|
| | పు. స్త్రీలు | పు. స్త్రీలు | పు. స్త్రీలు |

8. టూకీగా చేసిన కార్యక్రమ వివరణ

9. స్పందన (బాగున్న చోట్ల మన యూనిట్లును ప్రారంభింప ప్రయత్నం చేయవలెను)

తేది సమితి / భజన మండలి కన్వీనర్

## 9. వ్యక్తిగత ధర్మములు

★ **తల్లి యొక్క ధర్మములు**

1. తమ బిడ్డలకు ఏ తల్లిదండ్రులు ఆదర్శప్రాయులుగా, మార్గదర్శకులుగా నిలుస్తారో వారే నా అనుగ్రహమునకు పాత్రులవుతారు.

2. 2 సం. నుండి 5 సం.ల పిల్లలెప్పుడూ తల్లినే ప్రథమ గురువుగా చూస్తుంటారు. ఇందుకోసమై తల్లులు మంచి అలవాట్లు, నడవడికతో జీవిస్తూ పిల్లలను ఆదర్శవంతంగా పెంచాలి.

3. పిల్లలు పెరిగే ఇంటి వాతావరణం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత తల్లిదే. ద్వేషములు, కక్షలు కార్పణ్యములు లేని దివ్యమైన వాతావరణంలో తమ పిల్లలను పెంచుకోవాలి.

4. బిడ్డలో సౌశీల్యము పెంపొందిచుట తల్లిదండ్రుల ప్రథమ కర్తవ్యము. వల్లమాలిన ప్రేమతో మితిమీరిన స్వాతంత్ర్యమును పిల్లలకిచ్చి వారిని నాశనం చేయరాదు.

5.తల్లిదండ్రులెప్పుడూ తమ పిల్లలను విద్యావంతులు చేయాలనే అనుకుంటారు గానీ ఎట్టి విద్యలను వారి చేత అభ్యసింపచేయవలెనో గ్రహింపజాలరు. విద్య అనునది పిల్లలలో దివ్యమైన మానవతా విలువలను పెంపొందింప చేయునది గా వుండాలి. విద్య అనునది జీవితంలో ఎదురయ్యే పలురకములైన సవాళ్ళను నైతికంగా, ఆధ్యాత్మికంగా సమర్థవంతముగా పిల్లలు ఎదుర్కొనేలా చేయాలి. మానవతా విలువలు లేని విద్యాభ్యాసము వల్లనే నేడు ఎందరో వ్యక్తులు చింతలు చీకాకులతో సతమతమయ్యి విలవిలలాడుతున్నారు.

6. పిల్లలు తీసుకునే ఆహార పానీయాలు పరిశుభ్రమైనవిగా వుంచాలి.

7. ఇంటిలో ఆధ్యాత్మిక విలువలకు మూలమైన శక్తిగా తల్లి నడిచినప్పుడు పిల్లలు తల్లిని గురువుగా భావించి వృద్ధి చెందగలరు.

8. తమ పిల్లలను తల్లిదండ్రులు ఆదర్శవంతంగా తీర్చిదిద్ది సమాజమునకు

ఉపయోగపడు ఉన్నతమైన వ్యక్తులుగా మార్చి అసహాయులకు, దీనులకు చేయూత నివ్వగలగిన వాళ్లుగా తయారుచేయాలి. వారి జీవితమును వారే నడిపించుకొనేలా చేయాలి. ఇట్టి మార్పు రాకున్న తల్లిదండ్రులు తమ కర్తవ్య నిర్వహణలో ఏమీ సాధించని వారగుదురు.

9. తల్లి యొక్క ప్రథమ ధర్మము పిల్లలయొక్క నైతిక మరియు ఆధ్యాత్మిక జీవితమునకై శిక్షణ ఇచ్చుటయే.

10. పిల్లల సాంఘిక ప్రవర్తనకు తల్లి ఉదాహరణమవ్వాలి. వారి వేషభాషలకు తల్లియే ఆదర్శమవ్వాలి. వారి మానసిక, శారీరక ఆరోగ్యమునకు సంరక్షకురాలిగా జీవించాలి.

## ★ తండ్రి యొక్క ధర్మములు

1. తల్లిదండ్రుల ప్రప్రథమ బాధ్యత పిల్లలను మంచివారుగా తీర్చిదిద్దుట. మితమీరిన ప్రేమానురాగములతో పిల్లలకు ఎక్కువగా స్వతంత్రము ఇవ్వరాదు.

2. బడిలో అధ్యాపకుడు పిల్లలకు బోధించిన శిక్షణకు అనుగుణంగా ఇంట్లో తల్లిదండ్రులు ప్రవర్తించవలెను.

3. సరియైన జీవనవిధానమునకు క్రమశిక్షణ యే మూలము. తల్లిదండ్రులు పిల్లలనెప్పుడూ తమ కనుసన్నలలోనే పెంచవలెను. తమ కనులు కప్పి పిల్లలు పెడమార్గంలో నడవకుండునట్లు చూడవలెను.

4. పిల్లలకు, విద్యార్థులకు ఆదర్శమూర్తులైన తల్లిదండ్రులు మరియు గురువులే భగవదనుగ్రహమునకు పాత్రులు కాగలరు. మీరు స్వామిని ప్రేమిస్తున్నారని, మీరే భక్తులనుకుంటున్నారు గానీ స్వామికి మీ వల్ల ఆనంద ం కలుగుతున్నదా అన్నది పట్టించుకోవటం లేదు. మీకు మీరే స్వామికి ప్రియమైన పద్ధతిలో మీరు జీవిస్తున్నారా అని పరిశీలించుకోండి. స్వామి ఆదేశించిన సేవా కార్యములలో మీరు పాల్గొంటున్నారా? ఆలోచించండి. అది మాత్రమే మీకు నాప్రేమను అందించగలదు. పరులను ప్రేమించండి, సేవించండి తద్వారా నాప్రేమను మీరు పొందగలరు.

5. ఇంటికి పెద్ద దిక్కుగావున్న వారు వారికి నిర్ణయించబడియున్న పనులను,

కర్తవ్యములను, పూజాపునస్కారములను విధిగా నిర్వర్తిస్తూ తమ కుటుంబ సభ్యులందరి నడవడి, ప్రవర్తనలను గమనిస్తూ అందరినీ ఆదర్శమార్గంలో నడిపించాలి. ఇంటికి వచ్చిన వారికి చక్కటి అతిథి సత్కారములందిస్తూ, అభాగ్యులకు, దీనులకు చేతనయినంతగా సహాయపడుతూ తమ పిల్లలను కూడా ఇట్టి సన్మార్గములో నడిపించేందుకై కృషి చేస్తూ జీవితమున సుఖశాంతులు ఇట్టి మార్గములోనే సాధ్యమగునని బోధించాలి.

6. కుటుంబంలో నీచ ప్రవృత్తికి, చెడు ఆలోచనలకు స్థానం కల్పించిన ఆ దుర్గుణములు మొత్తం కుటుంబమునకే విపత్తు కల్గిస్తాయి. తద్వారా కుటుంబ నాశనమునకు కారణమవుతాయి. అందువల్ల ఇంటికి పెద్దలైన వారు ఇట్టి దుర్గుణములు ఎట్టి పరిస్థితులలోను కుటుంబంలో ప్రవేశించకుండు నట్లు చూచుకోవాలి.

7. తల్లిదండ్రులెప్పుడూ తమ పిల్లలను వెనకేసుకుని రాకూడదు. ఆ చిన్నారుల ముందు వారు చేసిన తప్పులను సమర్థించుట కానీ, పరులను నిందించుట, వారిని దూషించుట గానీ చేసిన చిన్నారుల భవిష్యత్తును నాశనం చేయువారవుదురు.

8. ఏ తండ్రైనా బిడ్డ నుండి దూరమవవలసిందే. బిడ్డను విడిచి వుండటంలో ని దుఃఖమును తట్టుకొనవలసినదే. కారణమేమనగా బిడ్డను ఎప్పుడైతే మరో మంచి వ్యక్తికిచ్చి వివాహం జరిపిస్తారో తద్వారా కలుగు ఎడబాటు భరిస్తూ తన కన్నబిడ్డ బాగోగులు చూడటంలో ఆనందం అనుభవించాలి.

9. మీరు ఇంట్లో ఉన్న సమయంలో మీకై నిర్దేశించిన కర్మలు మరియు కర్తవ్యములు నిర్వర్తిస్తూ ఏమి చేస్తున్నా భగవదానందం కోసమన్న దివ్యభావన లతో, ఆదర్శప్రాయమైన ఆలోచనలతో అన్నింటినీ సమానమైన దృష్టితో చూస్తూ జీవించటంలోనే సత్యమైన వైరాగ్యం వుంటుంది.

10. తల్లిదండ్రులు తమ బిడ్డలకు భగవంతుడి దివ్యవైభవమును గురించి తెలుపుతూ భగవదనుగ్రహమును పొందే భక్తి మార్గముల గురించి వారికి తెలియపరచి వారిని నడిపించాలి.

★ **గురువుయొక్క ధర్మములు**

1. గురువు ఎట్టి పరిస్థితులలోనూ మత, వర్గ, కుల, వర్ణ, వయో బేధములను దృష్టియందుంచుకొని బాలవికాస్ తరగతులను నిర్వహించరాదు.

2. ఒక విద్యార్థి చెడ్డవాడైన వాడి జీవితమే నాశనమగును, కానీ ఒక గురువు చెడ్డవాడైన ఎందరో విద్యార్థుల జీవితాలు నాశనమగును.

3. మానవతా విలువలు ఎప్పుడు గ్రంథపఠనము ద్వారానో లేక ఉపన్యాసము వినుట ద్వారానో నేర్వలేము. ఎవరు విద్యార్థులలో ఇట్టి విలువలు అభిలషిస్తారో వారే మొదట అట్టి విలువలను తమ జీవితములో ఆచరించి ఆదర్శమును నిరూపించాలి.

4. మానవతా విలువలను బోధించు సమయమున, ధనము, కాలము మరియు ఆహారము వృధా చేయువలదన్న విషయమును చక్కగా విద్యార్థులకు బోధించవలెను. గురువులు కూడా ఇట్టి విషయమును అభ్యసించి ఆచరించి చూపాలి.

5. గురువు యొక్క ప్రథమ కర్తవ్యము విద్యార్థి హృదయమును విశాలముగావించుటయే అని గుర్తించవలెను.

6. నిన్నే నమ్మి, నీ మార్గదర్శకత్వమునకై నిన్నాశ్రయించిన విద్యార్థుల కోసమై నీ సర్వస్వము ధారపోయుటకైనా సిద్ధపడవలయును.

7. గురువులెప్పుడు కాలపరిమితి పెట్టుకొని పని చేయడం తగదు. విద్యార్థుల సందేహములను నివృత్తి చేయుటకై వారి హృదయాలను ఆనందంలో నింపుటకై ఎన్ని గంటలైనా పిల్లలతో గడుపవచ్చు. ఇదియే గురువు ప్రధాన కర్తవ్యము.

8. విద్యార్థులందరికీ తల్లిదండ్రులను పూజించుట, గౌరవించుట ప్రథమ పాఠముగా బోధించాలి.

9. విద్యార్థులకు ప్రేమను బోధించవలెనన్న వారిని ప్రేమించుటయే సులభ మార్గముగా గుర్తించి వర్తించాలి.

10. గురువు ఎల్లప్పుడు విద్యార్థుల హృదయాంతరాళములలో అగమ్యగోచరముగా వుండు కళలను, నైపుణ్యములను మరియు సద్గుణములను, వారిని

ప్రోత్సహించడం ద్వారా బయటకు తీసి వాటి ద్వారా లోకమునకు విద్యార్థు లేమి చేయగలరో చేసి చూపించాలి.

### ★ భర్త యొక్క ధర్మములు

1. ఒక స్త్రీ ఏ విధంగా ఓ పురుషుని ప్రభువుగనూ మరియు భర్తగనూ స్వీకరిస్తుందో అదేవిధంగా పురుషుడు కూడా ఒక స్త్రీని తన సహధర్మచారిణిగా, భార్యలా భావించాలి.

2. భర్త తన భార్యను ఇంటికి ఇల్లాలుగా గౌరవించడమే గాక ఆమె ఇష్టాయిష్ట ములను పురస్కరించుకొని జీవనం సాగించాలి. ఎందుకంటే భార్య కేవలం ఇల్లాలే కాదు ఆమె గృహలక్ష్మి కూడా.

3. పేరు ప్రఖ్యాతులు, గౌరవా గౌరవములు, తెలివితేటలు, మంచిచేయుట మొదలగునవి కూడా భార్యాభర్తలకు సమానము. భార్యకు ఒక ధర్మము భర్తకు మరియొక ధర్మమన్నది లేదు. ధర్మ స్రవంతిలో ఇద్దరూ సమానమే.

4. భర్త, భార్యా బిడ్డలను ఎంతో బాధ్యతాయుతంగా చూచుకుంటూ వారిని రక్షించాలి.

5. భార్యభర్తలు ఒకరి మీదొకరు పరిపూర్ణమైన నమ్మకములతో జీవితం గడపాలి. పరస్పర విశ్వాసముతో జీవించినప్పుడే ప్రేమానురాగములకు సార్థకత ఏర్పడుతుంది.

6. భర్త వానప్రస్థమును స్వీకరించదలచిన తన భార్యయొక్క సమ్మతము పొందవలెను.

7. వానప్రస్థమును స్వీకరించు భర్త తన కుటుంబమునకు కావలసిన సర్వ సౌకర్యములు చేకూర్చవలెను.

8. ఒక వేళ భార్య కూడా తనతో పాటుగా వానప్రస్థమును స్వీకరించుటకు సంసిద్ధతను వ్యక్తం చేసిన ఎడల ఆమెను కూడా భర్త స్వీకరించాలి. ఆధ్యాత్మ మార్గంలో చేయూత నిచ్చి నడిపించాలి. భార్య భర్తలుగా గాక అన్నచెల్లెళ్ళుగా జీవించాలి.

9. భార్య బిడ్డలను ప్రేమించాలి. భర్తలు, తండ్రులు వారు చేయవలసిన

కార్యములు నిర్వర్తించాలి. కానీ విలువలకు తిలోదకం ఇవ్వకూడదు.

10. నాడు శ్రీరాముడు సీతా వియోగముతో దుఃఖించుట మనమెరుగుదుము. కానీ మర్యాద పురుషోత్తముడైన శ్రీరాముడు భార్యయొక్క విలువను లోకము నకు చాటదలిచియే ఆవిధంగా ప్రవర్తించాడు. భార్యా వియోగ సమయంలో శ్రీరాముడు ద్వితీయ వివాహం గురించి ఆలోచించలేదు. తన భార్యను తాను రక్షించడం ధర్మంగా, బాధ్యతగా ఎంచాడు. ప్రతి భర్త ఇట్టి సంస్కారమును కలిగి వుండాలి.

**★ భార్యయొక్క ధర్మములు**

1. మాన మర్యాదల నిమిత్తమై భార్య ప్రాణత్యాగమునకైననూ సిద్ధపడవలెను. భర్తయొక్క కీర్తి ప్రతిష్ఠలను కాపాడగల శీల సంపత్తితో జీవించవలెను. ఇవియే భార్యయొక్క ప్రధాన ధర్మము.

2. మానమర్యాదలే స్త్రీమూర్తికి భూషణములు. ఎట్టి పరిస్థితిలోనూ వీటికి భంగం కల్గించరాదు.

3. పాపభీతి, దైవప్రీతులను హృదయాన ప్రతిష్టించి వినయ విధేయతలతో జీవితము గడపాలి.

4. త్రికరణశుద్ధి కలిగిన ప్రవర్తనలతో వర్తించవలెను.

5. భార్య సాత్వికముగా, సౌమ్యముగా వుండవలెను.

6. ఉన్నత ఆదర్శములను జీవితమున నిరూపించవలెను.

7. సౌకుమార్యము మరియు అనురాగ పూర్వకమగు కోపమును ప్రదర్శించ వలెను.

8. ఇంటికి ఇల్లాలే దీపము. ఆమె మత విశ్వాసములను పెంచి పోషించునదిగా ఉండవలెను.

9. భార్య, భర్త మరియు తన యొక్క కుటుంబము యొక్క యోగక్షేమములు ఎల్లవేళలా మదినందుంచుకొని మెలగవలెను.

10. వివేకవతియగు భార్య తను చేయు కర్మల ద్వారా భర్తయొక్క పేరు ప్రఖ్యాతులను మరింతగా ఇనుమడింపజేస్తుంది.

**★ పుత్రుడి యొక్క ధర్మములు**

1. తల్లిదండ్రులను దివ్య స్వరూపములుగా భావించాలి.

2. అన్నదమ్ములతో, అక్కచెల్లెళ్ళతో వాదులాడుకొంటూ ఇంటిని అశాంతికి ఆలవాలము చేయరాదు.

3. ప్రతి నిత్యము ప్రాతఃకాలమున తల్లిదండ్రుల పాదములకు నమస్కరించి ఆశీర్వాదము అందుకోవాలి.

4. తల్లిదండ్రులను సాక్షాత్తు భగవత్స్వరూపులుగానే విశ్వసించాలి. తలిదండ్రులను అలక్ష్యం చేసి, భగవంతుని స్మరిస్తూ కాలం గడపడం వల్ల వచ్చు ప్రయోజనమేమియు లేదు.

5. ఎల్లవేళల భగవత్ చింతనతో గడుపుతూ పవిత్ర కర్మలు ఆచరిస్తూ దివ్య జీవితమును గడుపువాడే మంచి పుత్రుడిగా పరిగణించబడుతాడు. సుపుత్రుని యొక్క ప్రథమ లక్షణము మంచి ప్రవర్తన, మంచి క్రమశిక్షణ, భక్తి విశ్వాసములు.

6. మంచి కుమారుడనువాడు తన ప్రవర్తన ద్వారా ఆదర్శమును నిరూపించాలి. స్వార్థస్వప్రయోజనముల కొరకు బ్రతుకువాడు మంచి పుత్రుడు కానేరడు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించు వాడు నిజమైన పుత్రుడని పించుకుంటాడు. వినయ విధేయతలతో పెద్దలను పూజించి, సమాజసేవ ద్వారా మంచి కీర్తి సంపాదించుకొనువాడే నిజమైన పుత్రుడు. నేటి సమాజంలో ఇట్టి పుత్రులు చాలా అరుదుగా ఉంటారు. కారణమేమనగా దేశమున నేడు అసుర సంస్కృతులు ప్రబలివున్నవి.

7. పరిశుభ్రమైన నడవడి, ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరచుకోవాలి. ధనమును సద్వినియోగము చేయాలి. ధనమును వృధా చేయని పుత్రుని భవిష్యత్తు ఎల్లప్పుడు బంగారం అవుతుంది. పుత్రులెప్పుడూ మంచిప్రవర్తనతో ఇంటా, బయటా సంచరించాలి.

8. పుత్రుని ప్రథమ కర్తవ్యము తన తండ్రి పూర్తి చేయని కార్యములను పూర్తి చేయుడమే. గురువాజ్ఞనయినా ధిక్కరించవచ్చు కానీ తండ్రి మాట జవదాటరాదు.

9. ప్రతి పుత్రుడు మంచి పౌరుడిగా పేరు తెచ్చుకొని కుటుంబమునకు మరియు దేశమునకు పేరు ప్రతిష్టలు తీసుకొని రావాలి.

10. తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా వుంటూ వారికి కన్నులలో కన్నీరు తెప్పించని విధంగా చూసుకుంటూ వారిని ప్రేమించాలి, సేవించాలి. వినయముతో, ప్రేమతో జీవితమును గడపాలి.

★ **పుత్రిక యొక్క ధర్మములు**

1. తల్లిదండ్రులను ప్రేమానురాగాలతో, కృతజ్ఞతతో చూసుకోవడమే పుత్రిక యొక్క ప్రథమ కర్తవ్యం. సత్యభాషణము, సత్ప్రవర్తన కలిగివుండుట ద్వితీయ కర్తవ్యము. తీరిక సమయము దొరికినప్పుడు భగవత్‌నామమును ఉచ్చరించడం తృతీయ కర్తవ్యము. పరనింద మరియు ఇతరులలో తప్పులు వెదుకుట దుర్లక్షణముగా ఎంచి వీటికి దూరంగా వుండాలి. ఇక చివరిగా ఇతరులనెప్పుడూ నొప్పించరాదు.

2. ఈ ప్రపంచమున నాలుగు విధములైన ఋణములుంటున్నాయి. ఇవి మాతృఋణము, పితృఋణము, గురు ఋణము మరియు దైవఋణము. తల్లి తన రక్తమాంసములను, శక్తినీ నీకు ధారపోసిన దివ్యమూర్తి. నీ జన్మకు కారణమూర్తి ఆమెయే. ఆమెను గౌరవంగా చూచుకొనుట నీవు చేయవలసిన ప్రధాన కర్తవ్యము. తండ్రిని కూడా సరియైన విధముగా గౌరవించాలి. కారణమేమనిన తండ్రియే నీకు కావలసిన ధనము, నిజజీవితమునకు వలయు విద్యను సమకూర్చుటమే గాక నీకు రక్షణ కల్పించగలడు. గురువులు మనిషి జీవితాన్ని సంస్కారవంతంగా మారుస్తారు. విలువల ద్వారా మీ జీవితములను ఆదర్శవంతం చేస్తారు. వీటన్నింటికి మూలమైన భగవంతుని మరువక భక్తిశ్రద్ధలతో పూజించాలి.

3. తల్లిదండ్రులను దివ్యమూర్తులుగా భావించి పూజించాలి.

4. అక్కచెల్లెళ్లతో, అన్నదమ్ముల్లతో వాదులాడుకొని గృహమున అశాంతికి కారణం కారాదు.

5. తల్లిదండ్రులను ముందుగా భగవత్స్వరూపులుగా గుర్తించి వర్తించాలి. వారిని అలక్ష్యం చేస్తూ భగవత్ చింతన చేయుటము భగవత్ కార్యంలో పాల్గొనడం నిష్ప్రయోజనమే.

6. వివాహమయ్యేంతవరకు తల్లిదండ్రుల సంరక్షణలో వున్న నీవు వివాహానంతరం అత్తవారింటికి పేరుప్రఖ్యాతులు సమకూర్చాలి. ఇదియే నీ కర్త వ్యము. భగవదనుగ్రహమును ఇట్టి కర్మలు నిర్వర్తించుటము ద్వారానే పొందగలవు.

7. సత్ప్రవర్తనతో జీవించడం నేర్చుకో, పిల్లపాపలను ప్రేమించు. నీ కర్తవ్యము ను ఆనందంగా మరియు ఆహ్లాదంగా నీ శ్రేయోభిలాషులు సంతృప్తి పొందే విధంగా నిర్వర్తించు. నీవు చేయు తప్పులకు, నీ హృదయంలో పశ్చాత్తాపం జనించిన తక్షణం సాక్షాత్ భగవంతుడె నిన్ను క్షమించగలడు. దినదిన ప్రవర్ధమానముగా నీవు సత్‌పరిణతి చెందుతున్నప్పుడు దేవుడు సహితం దయను నీపై ప్రవహింపజేస్తాడు. ఈ సమయమునందే మీరు ఈ దివ్యభూమికి ఉపయోగపడగల పిల్లలుగా తయారవ్వాలి.

8. పరిశుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరచుకోవాలి. ధనమును పొదుపు చేయడం మరియు సరియైన పద్ధతిలో ఉపయోగపెట్టడం నేర్చుకోవాలి. ఎప్పుడు పిల్లలు ధనమును సద్వినియోగపర్చడం నేర్చుకుంటారో అప్పుడు వారి భవిష్యత్తు బంగారుమయమవుతుంది. అంతేకాక పిల్లలు ఇంటా బయటా మంచి ప్రవర్తనతో జీవించడం నేర్చుకోవాలి.

9. విద్యార్థినులు మరియు మహిళా అధ్యాపకులు ఎల్లప్పుడు తమ వేషభాష లందును, హావభావములందును తగిన విధంగా దృష్టిపెట్టి సాటి యువకుల కళ్లకు, నోళ్లకు పని కల్పించని విధంగా జీవించాలి. కాస్త పాత తరం మనిషిలా కనిపించినా పరవాలేదు. కొత్త పోకడలు, ఆడంబరాల పేర విశృంఖలత్వంతో దేశ సంస్కృతీ సాంప్రదాయములకు భంగం వాటిల్లే విధంగా ప్రవర్తించకండి.

10. తల్లిదండ్రులకు ఉపయోగపడవలెను తప్ప మీ ప్రవర్తనతో వారి కళ్ళలో కన్నీళ్లకు కారణమవరాదు. వారిని ప్రేమించండి, సేవించండి. ధర్మబద్ధంగా మీరెక్కడున్న ఎట్టివారి సాహచర్యంలో వున్నా జీవించడం నేర్చుకోండి. భగవన్నామమును విస్మరించకండి. దేవుడి దివ్య వైభవమును, లీలలను, ప్రేమను గుర్తెరిగి జీవించాలి.

★ **సేవకుడి యొక్క ధర్మములు**

1. ప్రతి పనివాడు తను చేయు విధిని భగవత్ కర్మగానూ మరియు పనినే పూజగాను భావించవలెను.

2. ప్రతి నిత్యము పనికి ముందు భగవత్ ప్రార్థన సలపాలి. అట్లే పని పూర్తయిన తర్వాత భగవత్ భజనలో చేరి భగవంతుడికి కృతజ్ఞతలందించు కోవాలి. భగవత్ వైభవమును స్తుతిస్తూ దినమునకు స్వస్తి పలకాలి.

3. ప్రతి పని వాడు, ప్రధాన కార్య సాధనలో ఓ పవిత్రమైన పాత్ర నిర్వర్తించే వాడిగానే గౌరవింపబడాలి. అందరూ భగవతాంశలుగానే భావించాలి. అందరినీ సమానంగా ప్రేమించాలి.

4. తీసుకున్న ప్రతి బాధ్యతను అత్యున్నతమైన రీతిలో నిర్వర్తించడమే గాక చక్కటి నైపుణ్యంతో పూర్తి చేయాలి.

5. బాధ్యతలను నిర్వర్తించే సమయంలో బాధ్యతారహితంగా ప్రవర్తించక, లోపరహితమయిన పనులు చేసేందుకై పూనుకోవాలి.

6. ఎట్టి పరిస్థితులలోనూ ఇవ్వబడిన బాధ్యతనుండి తప్పించుకొనరాదు. అనైతికముగా ప్రవర్తించరాదు. ధర్మముగానే జీవించవలెను. మనస్సాక్షికి విరుద్ధ ంగా ప్రవర్తించరాదు. బుద్ధిని అనుసరించియే పని పూర్తి చేయవలెను.

7. కొందరు అత్యున్నతమయిన బాధ్యతలు నిర్వర్తిస్తుంటారు. ఉన్నతాధికారులుగా చలామణి అవుతుంటారు. అంతమాత్రం చేత వారు వారి ఇష్టారాజ్యముగా ప్రవర్తించరాదు. దురుసుగా మాట్లాడరాదు. మాటలు, చేతలు, రాతలు మొదలగు వాటి ద్వారా ఎవరినీ బాధించరాదు. తాను చేయు కర్మల యొక్క పర్యవసానమును ఆలోచించియే పనిచేయవలయును.

### ★ సాయినాయకత్వ ధర్మములు

1. సేవించడం ద్వారానే నాయకత్వము అనుభవించుట సాధ్యం. మంచి సేవకుడు మాత్రమే మంచి నాయకుడు కాగలడు.

2. నాయకుడు కావాలనుకొనే ప్రతి వ్యక్తి మూడు రకములైన మేధస్సులను సంపాదించాలి. మొదటిది స్వీయ మేధస్సు (తన యొక్క బలములు మరియు బలహీనతలు ఎరిగిన తత్త్వము), రెండవది తాను పనిచేయు రంగములో

వుండవలసిన తెలివి తేటలు, ఇక మూడవది సాంఘిక పరిస్థితుల గురించిన అవగాహన.

3. ఇతరులకు చెప్పుటములోనే కాలం గడుపుతూ తన జీవితంలో ఆచరణ రహితముగా జీవించు వ్యక్తులను నాయకులుగా పరిగణించడం తగదు. ఇట్టివారు నాయకులుగా అనర్హులు. ప్రచారము కంటెనూ ఆచరణే ప్రధానము అని గుర్తించిన వారే సత్యమైన నాయకులు.

4. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ మరియు అహింసలను ఎవరైతే జీవితంలో ఆచరించగలరో అట్టి వారే దివ్యానందమును అనుభవించగల అద్భుత జీవితమును గడుపగలరు. వారే నాయకులుగా పిలువబడుతారు.

5. సత్యమైన నాయకుడెప్పుడూ స్వార్థరహితంగానే జీవిస్తాడు. అనుక్షణం పరహితం కోసమై బ్రతుకుతూ తన జీవితమును ఆదర్శవంతముగా మలచి, ఆకార మానవుడిలా కాక ఆచార మానవుడిలా ఆదర్శమును నిరూపించుతాడు.

6. సర్వకాల సర్వావస్థలయందును నాయకుడు ముందుండి సారథ్యం వహించాలి తప్ప, వెనుక నిలుచొని ఆజ్ఞలు జారీ చేయరాదు. తన ప్రవర్తన ద్వారానే ఆదర్శమును నిరూపించాలి. యావత్ ప్రపంచమునకు నేడు కావలసింది తమ ప్రవర్తనద్వారా మార్గదర్శకత్వం చేయగల నాయకులే.

7. ఏ నాయకుడైతే తనది, నాది అన్న భావములు విడనాడి పరుల శ్రేయస్సు కోసమై, జనహితము కోసమై జీవిస్తూ, ఆదర్శ మానవునిలా జీవిస్తాడో వాడినే సత్యమైన నాయకుడు అంటారు.

8. ఎవరైతే కఠిన క్రమశిక్షణ మరియు విచక్షణా శక్తిని అలవరచుకొందురో వారే సత్యమైన సాయికార్యంలో ఉపయోగపడగల సమర్థనాయకులుగా రాణించ గలరు. వ్యక్తిగత సౌశీల్యముతో పాటుగా సంఘమున నీతిగా బ్రతుకుట నేర్చుకోవాలి. దీనికి ప్రధానముగా త్రికరణశుద్ధియే మార్గమని గుర్తించి వర్తించాలి.

9. సమర్థవంతమైన నాయకుడికి తన ప్రజలందరి గురించి వారి తల్లులకంటే ఎక్కువగానే తెలిసుంటుంది. తల్లికంటే మించిన ప్రేమానురాగములను వారిపై చూపించగలడు.

10. నాకు కావలసినది మీరు సమర్థవంతమైన నాయకులుగా తయారై జగత్తును

సంరక్షించుటయే. సింహ సదృశ్యమైన నాయకులుగా తయారై, ఆత్మసంరక్షణ, ధైర్యము, హుందాతనము, న్యాయము, మొదలగు లక్షణములతో శోభించాలి. జంతువులకు రారాజు సింహమన్నట్లు మనుష్యలందరిలోనూ సత్కీర్తి పొంది రారాజులనిపించుకోవాలి.

**★ సాయి భక్తుని యొక్క ధర్మములు**

1. మూడు ప్రధానమైన విషయములు సాయిభక్తులందరూ మదిలోన గుర్తుంచుకొని వర్తించాలి. అవి ఏవనగా మొదటిది, భగవత్ చింతన తప్ప ఇంక ఏ చింతా నీవు చేయరాదు. రెండవది, భగవత్ సంకల్పము లేనిదే నీవే పని నిర్వర్తించలేవు. ఇక మూడవది, నీ శ్రద్ధ, ఏకాగ్రత ఎల్లప్పుడు భగవంతుడి మీదే నిలపాలి.

2. ఇంద్రియములను నిగ్రహముతో జయించవలెను. చెడు చూచుట, మాట్లాడుట, చెడు వినుట, చెడు చేయుట, చెడు ఆలోచించుట మొదలగు వాటినుండి దూరముగా ఉండవలెను.

3. పరులకు సహాయ పడలేకున్ననూ సరే కానీ మృదుభాషణతో వారిని సేద తీర్చు. పరిశుభ్రమైన భావములతో, మధుర భాషణలతో ఎదుటి వారిని సంతోష పెట్టేలా నడుచుకోవాలి.

4. సర్వులను ప్రేమించడంలోనే నీవు సర్వేశ్వరుడిని ప్రేమించడమవుతుంది. కారణమేమనగా సర్వులు ఆ దివ్యాత్మ స్వరూపములే. అందరిలో భగవంతుని చూడు. నీ శత్రువులలో సహితము దేవుని చూడగలగాలి. ఏమి ఆచరించినా ప్రేమ అందులో అంతర్భాగమవ్వాలి.

5. నీ కర్తవ్యము నీకున్న సర్వశక్తియుక్తులతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి. ఏకార్యం చేసినా అవన్నీ కేవలం భగవత్ కార్యముగానే భావించాలి. కర్మ, కర్మ ఫలమును భగవంతునికి అర్పితము గావించి భగవత్ కృపకై, అనుగ్రహమునకై, దయకై ప్రార్థించండి.

6. సాటి వారిలో నివసించే సాయిని సేవించుటయే నీ దైనందిన పూజా విధానమని గుర్తించవలెను.

7. ఉన్నదానితో తృప్తి పడటం మరియు సంతోషముగా జీవించడం

అలవరచుకోవాలి. సుఖ సంతోషముల కోసమై ఎక్కడెక్కడికో పరిగెత్తుట మాని అవి నీలోనే వున్నాయన్న సత్యమును గుర్తించి వర్తించవలెను.

8. మీలో ప్రతిఒక్కరూ సంస్థయొక్క దివ్యసిద్ధాంతముల కనుగుణంగా జీవనం సాగించాలి. కొందరు సభ్యులు సంస్థల నియమావళిని అతిక్రమిస్తుంటారు. కొందరు కార్యవర్గ సభ్యులు సంస్థాగత కార్యక్రమములలో పాల్గొనుట లేదు.

9. సత్యసాయి సంస్థల కేంద్రములన్నియు అనవసర విషయములకై ధనమును ఖర్చు చేయరాదు. ధనమును దుర్వినియోగము చేయుటకన్నా మించిన చెడు మరొకటి లేదు. అన్నమును వృధా చేయరాదు. శక్తిని వృధా చేయరాదు. కాలమును వృధా చేయరాదు. ఒకవేళ మీరు భగవంతుడిచ్చిన ఈ శక్తులను వృధా చేసిన మీ జీవితములే వృధా అయిపోవును.

★ **యువకుల యొక్క ధర్మములు**

1. ప్రస్తుతమున్న సమయమును సద్వినియోగం చేసుకుంటూ మీ శక్తియుక్తులకు సాన పెట్టండి. విశాలమైన దృక్పథమును అభివృద్ధి చేసుకోండి. విశాల హృదయమును అలవరచుకొని జీవితములో ఎదురయ్యే సవాళ్లను ధీటుగా ఎదుర్కొనగల ధైర్యమును, సమానతను వృద్ధి చేసుకోండి. ఇట్టి విధమైన జీవితమే మీపై ప్రేమానురాగములు కురిపించే తల్లిదండ్రులకు మీరందించగల బహుమానం. అంతేగానీ శీలరహితమైన జీవితమును, నిష్ఫలమైన జీవితమును వారికి అర్పించకండి. తల్లిదండ్రులను సంతోషపరచండి. విద్యా సముపార్జనలో ప్రథమశ్రేణిని సాధించండి. అట్టి విధముగానే శీలసముపార్జనలో కూడా ప్రథమశ్రేణిని సాధించాలి.

2. ప్రతి విద్యార్థి నవరత్న సమానమైన లక్షణములు కలిగియుండాలి. అవి స్ఫూర్తిదాయకమైన త్యాగబుద్ధి, వినయము నిస్వార్థ సేవ, స్నేహశీలత్వము, క్రమశిక్షణ, సమైక్యత, సత్యము, ప్రేమ, అహింసల మీద అకుంఠిత దీక్ష, భగవత్ విశ్వాసము.

3. విద్యార్థులు ఎల్లప్పుడు క్రమశిక్షణతో మెలుగుతూ పవిత్రమైన మనసుతో, పవిత్రమైన అలవాట్లతో, పవిత్రమైన కర్మలను ఆచరిస్తూ నిత్య జీవితమున ఆదర్శప్రాయముగా నిలవాలి.

4. నాకు నిశబ్దము అనిన బహు ప్రియము. ఎప్పుడు అవసరమో అప్పుడే మాట్లాడండి. ఎవరితో అవసరమో వారితోనే మాట్లాడండి. ఎంత తక్కువ మాటలలో సమాచారమందించగలరో ఎంత మృదుమధురంగా మాట్లాడగలరో అట్టి విధముగానే మాట్లాడండి.

5. యువకుల ప్రథమ కర్తవ్యము నేడు ఇంద్రియములను నిగ్రహించుకొని సదాచారసంపన్నులై జీవించుటయే.

6. తరచుగా వీధులవెంబడి తిరుగుతూ, సినిమా హాళ్ళ చుట్టూ తిరుగుతూ అనుచితమైన దుష్ట సహవాసములు పట్టి, దురలవాట్లకు బానిసలై జీవితమును నాశనము చేసుకొనరాదు.

7. స్నేహము అనునది ఆధ్యాత్మిక బంధము. హృదయ- హృదయ సంభంధము. పరస్పర అవగాహన, స్వచ్ఛమైన అంకితభావములపైనే ఇట్టి స్నేహము చిరకాలం జీవిస్తుంది. విద్యార్థులు దుష్ట సహవాసముల నుండి జాగరూకత వహించి దూరంగా వుండాలి. హలో, హాయ్‌లకు మరియు హస్తచాలనములకు మోసపోవద్దు. ఎదుటివారి ఆధ్యాత్మిక, నైతిక, స్వార్థరహితమైన జీవన విధానమును చూడకుండా అట్టి వారితో స్నేహము చేయవద్దు. సత్యమైన స్నేహము కేవలం ఆత్మబంధువులకే సాధ్యమగును. ఆత్మ దర్శనము పొందిన వ్యక్తుల స్నేహము చిరకాలము వర్ధిల్లునని గుర్తించండి.

8. నేర్చుకున్న విషయములలో కనీసము ఒక్కటి, రెండైనా నిత్య జీవితంలో ఆచరించటం విద్యార్థులందరూ అలవరుచుకుని ఆకార మానవులుగా కాక ఆచార మానవులుగా మెలిగి ఆదర్శప్రాయమైన జీవితమును గడపండి.

9. కేవలం ఓటమిని అధిగమించుటకై విజయమును పొందుటకై సత్యమైన, పవిత్రమైన, ధర్మమార్గమును వీడి అపవిత్ర మార్గములో ప్రవేశించకండి. అంతెందుకు చిన్నపని చేసినా సరే దానిని లోతుగా పరిశీలించి చేయునది మంచిదా, చెడ్డదా అని యోచించవలెను.

10. యువ విద్యార్థులారా మీ మనసులను, శరీరములను పవిత్రముగా ఉంచుకోండి. భగవదనుగ్రహం వల్ల కల్గిన ఈ దేహముద్వారా సత్యధర్మము లను దేశమున పరిరక్షించుటకై నడుం బిగించి ముందుకురకండి.

## 10. దీక్షాప్రార్థన మరియు ప్రతిజ్ఞ

సేవాదళ సభ్యులమైన మేము భక్తి శ్రద్ధలు, వినయ విధేయతలు, దీక్షా దక్షతలు, మృధుమధుర భాషణ, ఓర్పు, నేర్పు, శాంతి ప్రేమలు, వివేక విచక్షణలు క్రమశిక్షణ, నిస్వార్థంతో, సమాజసేవ చేసి సేవలో శ్రీస్వామి వారిని చూచుచూ సంస్థలలో, ఔత్సాహిక సేవకనిగా, స్వీయ సంస్కరణ ద్వారా, శ్రీస్వామి వారిని అనుగ్రహము పొంది దృఢ నిశ్చయములమై యున్నాము. తగుశక్తినిచ్చి యీ యంత్రములకు, అవకాశము అనుగ్రహించ ప్రార్థన.

## శ్రీసత్యసాయి క్రియాశీల సభ్యులు - ప్రతిజ్ఞ

నేను శ్రీసత్యసాయి సంస్థలో అనుబందము కలిగి ఉండుటకు నిర్ణయించుకొని సర్వవ్యాప్తియగు భగవానుని సమక్షంలో, చేతులు జోడించి ఈ ప్రతిజ్ఞ చేయుచున్నాను.

క్రమశిక్షణ నిబంధనలకు బద్ధుడనై, నానిత్య జీవితములోను మరియు సేవా కార్యక్రమములలోను వాటిని పాటించెదను.

మానవ సేవయే మాధవసేవ అన్న ధ్యేయాన్ని అవగాహన చేసుకొనుటకై నా సాధనగా సేవా కార్యక్రమాలను చేపట్టుటకు నేను స్వచ్ఛంద సేవకునిగా సంసిద్ధుడనై ఉన్నాను.

నా సర్వశక్తి యుక్తులను సేవా కార్యక్రమాలకై వినియోగించెదను.

భగవానునకు సముచిత ఉపకరణముగా ఉండుటకైనా సర్వశక్తిని వినియోగించి సద్గుణ సంపత్తిని పొందుదును.

నాయొక్క ఆలోచన, వాక్కు మరియు క్రియలలో ఏకత్వము ఉండునట్లు ప్రయత్నించెదను.

నా కుటుంబమునకు మరియు సంఘమునకు ఆదర్శవంతునిగా ఉండుటకు కృషి చేయుదును.

మరియు నేను భగవానుని ఈ విధముగా ప్రార్థించుచున్నాను.

నా ప్రేమ సంపూర్ణ భక్తి భావముతో తన వైపు ప్రవహించనిమ్ము.

నా చేతులు సర్వదా తన సేవకై వినియోగించనిమ్ము.

నా ఆత్మ తనయందే లీనమయి పోనిమ్ము.

నా బుద్ధి మరియు నా ఆలోచనలు తనయందే లగ్నమై పోనిమ్ము.

నా సర్వస్వము తన సేవకై అంకితము గానిమ్ము.

# GRAMASEVA (గ్రామ సేవ)

**G** - **GLORY of the Lord is to be sung**
(గ్రామ సంకీర్తనం చేయండి)

**R** - **RURAL LEADERSHIP should be encoura ed.**
(గ్రామస్తులలో నాయకత్వ లక్షణములు ప్రోత్సహించండి)

**A** - **AGRICULTURAL ADVISE**
(వ్యవసాయ సంబంధమైన సలహాలు అందించండి)

**M** - **MEDICAL CAMPS**
(ఉచిత వైద్య చికిత్సా శిబిరము నిర్వహించండి)

**A** - **ANIMAL HUSBANDRY CAMPS**
(ఉచిత పశువైద్య చికిత్సా శిబిరము నిర్వహించండి)

**S** - **SERVICE CAMP**
(వివిధ రకములైన సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టండి)

**E** - **EDUCATIONAL ACTIVITIES**
(గ్రామస్తులకు ఆరోగ్యము, పారిశుధ్యము, గ్రామసేవల గ చి వివరించి వారిని విజ్ఞానవంతులను చేయండి)

**V** - **VALUE BASED ACTIVITIES**
(స్వామి సందేశము, సాంస్కృతికాంశములు, పల్లకి మహో గాము, ఆధ్యాత్మికోపన్యాసములు నిర్వహించండి)

**A** - **ANANDA TO BE ATTAINED**
(దివ్యానందమును పొందండి)

ఓం శ్రీ సాయిరాం

# సాయిమాత బిడ్డలం అందరం....

పల్లవి : సాయిమాత బిడ్డలం అందరం - సాయిమాత బిడ్డలమే అందరం

చరణం 1
కలసి వుంటె కలదు సుఖం - కలహిస్తే దుఃఖమయం
పరస్పరం ప్రేమిద్దాం - పరదూషణ మానేద్దాం
కులబేధాలొద్దు మనకు - బాషాబేధాలొద్దు
అంటరానితనమొద్దు - అందరమొకటిగ వుందాం ॥సాయి॥

చరణం 2
దేశమంటే మట్టి కాదు - దేశమంటే మనుషులోయ్
దేశాన్ని ప్రేమిద్దాం - త్యాగాన్ని చూపిద్దాం
పవిత్రముగ జీవించి - పావన చరితను పొంది
స్వార్థమును విడనాడి - సత్యసాయిని చేరుదాం ॥సాయి॥

చరణం 3
మనశక్తిని మనము తెలిసి - యువశక్తిని చాటుదాం
గ్రామగ్రామాల్లోన - సేవలెన్నో చేద్దాము
సేవలెన్నైనా అవి - కష్టసాధనములైన
ఒకరినొకరు చెరి మనము - విజయము సాధించుదాం
ఒకరినొకరు చేరి మనము - స్వామిని సేవించుదాం ॥సాయి॥

సాయిరాం